'రాజ్య సంస్కరణ' ఈ-పేపర్ కోసం ఇక్కడ స్కాన్ చేయండి..

రాజ్య సంస్కరణ

TGBIL/26/A6717 RAJYA SAMSKARANA తెలుగు దినపత్రిక

www.rajyasamskarana.com

'రాజ్య సంస్కరణ' ఈ-పేపర్ కోసం ఇక్కడ స్కాన్ చేయండి..

మేడ్చల్ మల్కాజిగిరి | సంపుటి : 1 | సంచిక : 76 | శనివారం | 31.10.2026 | పేజీలు : 8 | వెల రూ. 2

Medchal Malkajgiri | Volume: 1 | Issue: 76 | Saturday | 31.10.2026 | Pages: 8 | Rate: 2



3లో..

నిరసన జ్వాల!

• సీఈసీపై విపక్షాల సమరం • ఓటు చోరీ ఆరోపణలపై పోరు

• నవంబర్ 1న చలో ఢిల్లీ ర్యాలీ • జ్ఞానేశ్‌పై నేడు బహిరంగ అభిశంసన



3లో..

రాహుల్ హిందుత్వ వ్యాఖ్యలే అస్త్రం

• పాత ప్రసంగాలతో బీజేపీ కొత్త యుద్ధం

• ఈసీ నియామకంపైనా ఎదురుదాడి • నాటి వ్యాఖ్యల వీడియో విడుదల



3లో..

అమిత్ షాపై విమర్శలు

ఆరోపణలకు ఆధారాలేవి!?

నిరూపించాలని బీజేపీ సవాల్

విపక్షాల మధ్య ఐక్యత లేదని ఎద్దేవా!



మహారాష్ట్ర ఎమ్మెల్యే కండకావరం

రైతుల ఆత్మహత్యలపై నీచ వ్యాఖ్యలు

అంత్యక్రియలకు వెళ్లొద్దంటూ ఓవరాక్షన్



3లో..

సమ్మతితో జరిగిన శృంగారం నేరం కాదు

సంబంధం చెడితే కేసుగా మార్చలేరు

విఫల ప్రేమకు అత్యాచారం ముద్ర తగదు!



3లో..

ఓట్ల తొలగింపు దందాపై గురి!

ఫారం-7 దుర్వినియోగంపై న్యాయస్థానం ఆరా

నివేదిక సమర్పించాలని ఈసీకి ఆదేశాలు

ఫేక్ దరఖాస్తులపై సుప్రీం కోర్టు ఆగ్రహం



ఐడీబీఐ విక్రయంపై రాహుల్ ఆగ్రహం!

ప్రభుత్వ బ్యాంకులు అమ్మకానికి కాదు

లాభాల్లోని బ్యాంకులను వదులుకుంటారా?

ఉద్యోగులకు అండగా ఉంటానని వెల్లడి




మూడు ట్రిలియన్ డాలర్ల లక్ష్యం

సమ్మిళిత అభివృద్ధితోనే సంపద

ప్రజల జీవితాల్లో మార్పు: భట్టి

తెలంగాణను 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దే సామర్థ్యం రాష్ట్రానికి ఉందని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అన్నారు. హైదరాబాద్‌లోని డాక్టర్ ఎం.సి.ఆర్. మానవ వనరుల అభివృద్ధి సంస్థ స్వర్ణోత్సవాల సందర్భంగా నిర్వహించిన జాతీయ సదస్సును ప్రారంభించిన ఆయన, ఆర్థిక వృద్ధి గణాంకాలకే పరిమితం కాకుండా సామాన్యుల జీవన ప్రమాణాలను మెరుగుపరచాలని స్పష్టం చేశారు. (వివరాలు 2లో..)

దోచుకుతిందాం రండి..!



వివరాలు5లో..

- చోద్యం చూస్తున్న పాలకులు
- రెచ్చిపోతున్న అక్రమార్కులు
- ప్రభుత్వ నిబంధనలకు పాతర
- కలెక్షన్లతో మిలర్ల జాతర

ఒకప్పుడు ఉల్లి ధరలే ప్రభుత్వాల పునాదులను కదిలించాయి.. ఇప్పుడు బియ్యం ధరలు సామాన్యుడి బతుకును బుగ్గిపాలు చేస్తున్నాయి! నిన్నటివరకు రూ. 1,500కు దొరికిన 25 కిలోల బియ్యం బస్తా నేడు రూ. 2,200 నుంచి రూ. 2,500కు చేరితే పేద, మధ్యతరగతి కుటుంబాలు ఎలా బతకాలి? కిలో సన్నబియ్యం రూ. 85 నుంచి రూ. 95 దిశగా దూసుకెళ్తుంటే పాలకుల పర్యవేక్షణ ఏమైంది? దేశవ్యాప్తంగా గోదాముల్లో లక్షల టన్నుల ధాన్యం, బియ్యం నిల్వలున్నా మార్కెట్లో ధరల మంట ఎందుకు చల్లారడం లేదు? ఎగుమతుల ప్రభావమా? అక్రమ నిల్వల ఆటనా? వ్యాపారుల గుత్తాధిపత్యమా? లేక ప్రభుత్వ యంత్రాంగం నిర్లక్ష్యమా? కర్ణాటక, తమిళనాడు, కేరళలోనూ ధరల సెగ కనిపిస్తున్నా.. ఎక్కువగా ఆంధ్రప్రదేశ్, తెలంగాణలో వినియోగదారుడిపై భారం మరింత తీవ్రంగా ఉందన్న ఆందోళన వ్యక్తమవుతోంది. ఒకవైపు ఎల్‌నినో హెచ్చరికలు.. మరోవైపు వరి సాగు తగ్గించాలన్న సూచనలు.. రైతు పొలంలో అనిశ్చితి, వినియోగదారుడి వంటింట్లో ధరల దాడి! జనవరి తర్వాత సరఫరా పరిస్థితి ఎలా ఉండబోతోంది? ప్రభుత్వ నిల్వలు ప్రజలకు ఉపశమనం కలిగిస్తాయా? బియ్యం మార్కెట్‌ను అదుపు చేస్తున్నదెవరు? ధరల పెరుగుదల వెనుక అసలు మాయాజాలం ఏమిటి? సంక్షేమ పథకాల లెక్కలు చెబుతున్న పాలకులకు సామాన్యుడి ఆకలి కనిపించడం లేదా? రైతుకు గిట్టుబాటు ధర, ప్రజలకు అందుబాటు ధర కల్పించాల్సిన బాధ్యత ఎవరిది? బియ్యం పండించే దేశంలోనే బియ్యం కొనలేని దుస్థితి ఎందుకు? ధరల మంట వెనుక దాగిన కారణాలు, ప్రభుత్వాల వైఫల్యాలు, రైతు నుంచి వినియోగదారుడి వరకు సాగుతున్న ధరల దోపిడీపై సమగ్ర పరిశీలన.. !

బియ్యం ధరల గుట్టు.. సర్కారు కనికట్టు



బియ్యం దందాపై కదిలిన సర్కార్

అక్రమ నిల్వలపై అధికారుల దాడులు

నిల్వల నుంచి తూకం దాకా అక్రమాలే

బియ్యం ధరల పెరుగుదలతో సామాన్యులపై పడుతున్న భారానికి కారణమవుతున్న అక్రమ నిల్వలు, అక్రమ విక్రయాలపై తెలంగాణ ప్రభుత్వం నిఘా పెంచింది. బియ్యం మార్కెట్‌లో జరుగుతున్న మోసాలకు అడ్డుకట్ట వేసేందుకు పౌరసరఫరాల శాఖ ఆధ్వర్యంలో వరుసగా రెండో రోజు హైదరాబాద్‌లో విస్తృత తనిఖీలు నిర్వహించారు. విజిలెన్స్, తూనికలు కొలతల శాఖ, జీఎస్టీ అధికారులతో కూడిన బృందాలు మంగళహాట్, మలక్‌పేట, అమీర్‌పేట, కర్మన్‌ఘాట్ తదితర ప్రాంతాల్లో రిటైల్, హోల్‌సేల్ వ్యాపారుల గోదాములు, దుకాణాలను తనిఖీ చేశాయి. కృత్రిమ కొరత సృష్టించి ధరలు పెంచేందుకు బియ్యాన్ని అక్రమంగా నిల్వ చేస్తున్నారనే అనుమానంతో ఈ దాడులు చేపట్టారు. రెండు రోజుల తనిఖీల్లో నిల్వల అక్రమాలతో పాటు వినియోగదారులను మోసం చేస్తున్న పలు విధానాలు వెలుగులోకి వచ్చాయి. (వివరాలు 2లో..)



6లో..

పాపులేషన్ పల్స్@ 2027

జనాభా లెక్కలు - తేడా వస్తే చుక్కలు

అనూహ్యంగా పెరిగిన పాపులేషన్

కులగణనతో కొత్త ఈక్వేషన్

ఎవరి జనాభా ఎంత? ఎవరి వాటా ఎంత? దేశంలో సామాజిక న్యాయం అసలు లెక్క తేలబోతోందా? పదిహేనేళ్ల సుదీర్ఘ విరామం తర్వాత దేశం మరోసారి జనాభా లెక్కల కోసం సిద్ధమవుతోంది. కానీ ఈసారి లెక్కించేది కేవలం మనుషుల సంఖ్య మాత్రమే కాదు.. దేశ సామాజిక స్వరూపాన్ని, కులాల బలాబలాలను, ఆర్థిక అసమానతలను, అభివృద్ధి అవసరాలను కూడా! 2027 జనగణనలో తొలిసారిగా డిజిటల్ విధానంతో పాటు దేశవ్యాప్త కులగణనకు అవకాశం కల్పించడం రాజకీయంగా కొత్త చర్చకు తెరలేపుతోంది. ఏ కులం ఎంత? ఏ వర్గం ఎంత వెనుకబడి ఉంది? రిజర్వేషన్లపై ఎలాంటి ప్రభావం ఉండబోతోంది? సంక్షేమ పథకాల రూపకల్పన మారుతుందా? పార్లమెంటు నియోజకవర్గాల పునర్విభజనలో కొత్త సమీకరణాలు తెరపైకి వస్తాయా? ఇప్పటికే విపక్షాలు కులాల వర్గీకరణ, సమాచార సేకరణ విధానం, వ్యక్తిగత గోప్యతపై ప్రశ్నలు సంధిస్తుంటే.. కేంద్రం సమగ్ర గణాంకాలే లక్ష్యమని చెబుతోంది. జనవరి 25 నుంచి దేశవ్యాప్తంగా ఇంటింటి గణనకు రంగం సిద్ధమవుతోంది. ఈసారి నమోదయ్యే ప్రతి సంఖ్య రేపటి విధానాలకు పునాది కావచ్చు. ఇది కేవలం జనాభా లెక్క కాదు.. దేశ సామాజిక, రాజకీయ భవిష్యత్తును ప్రభావితం చేయగల మహా గణాంక యజ్ఞం!



హైస్పీడ్ కారిడార్లకు వేగంగా అనుమతులు

- కొత్త రైలు మార్గాలకు సీఎం ప్రతిపాదనలు
- రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్‌తో సమావేశం

తెలంగాణలో రైల్వే మౌలిక వసతుల విస్తరణకు కీలక ప్రాజెక్టులను త్వరగా పట్టాలెక్కించాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కేంద్రాన్ని కోరారు. శుక్రవారం ఢిల్లీలోని రైల్ భవన్‌లో రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్‌తో సమావేశమైన ఆయన, హైదరాబాద్-పుణె, హైదరాబాద్-బెంగళూరు, హైదరాబాద్-చెన్నై హైస్పీడ్ రైలు కారిడార్ల పనులను వేగవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు. కేంద్రం పంపిన ప్రతిపాదనలను పరిశీలించి కొన్ని మార్పులతో రాష్ట్ర ప్రభుత్వం తిరిగి పంపిందని వివరించారు. ప్రస్తుతం ఈ మూడు మార్గాలకు సంబంధించి భూసేకరణ ప్రారంభించలేదని, కేంద్రం తుది అలైన్‌మెంట్ ఆమోదించిన వెంటనే భూసేకరణ చేపడతామని స్పష్టం చేశారు. అలైన్‌మెంట్ ప్రక్రియను వీలైనంత త్వరగా పూర్తిచేసి ప్రాజెక్టులకు మార్గం సుగమం చేయాలని కోరారు. (వివరాలు 2లో..)

కేసీఆర్ కుటుంబంపై సీఎం రేవంత్ గురి!

మియాపూర్ భూములపై హాట్ కామెంట్స్

మూడేళ్లలో లక్షన్నర కోట్ల ఆస్తుల రక్షణ

తెలంగాణలో ప్రభుత్వ భూముల పరిరక్షణ అంశం మరోసారి రాజకీయంగా వేడెక్కింది. మాజీ సీఎం కేసీఆర్, ఆయన కుటుంబ సభ్యులు ప్రభుత్వ భూములను ఆక్రమించేందుకు ప్రయత్నించారని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తీవ్ర ఆరోపణలు చేశారు. ఢిల్లీలో శుక్రవారం మాట్లాడుతూ, మియాపూర్‌లోని 550 ఎకరాలకు పైగా విలువైన భూములపై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును చారిత్రక విజయంగా అభివర్ణించారు.







ప్రభుత్వ భూములపై ఆక్రమణలకు ఇక చెక్!

కంచె గచ్చిబౌలి, మియాపూర్ వరకు విజయాలు

న్యాయపోరాటంలో ప్రభుత్వానికి ఊరట: పొంగులేటి

ప్రభుత్వ భూముల పరిరక్షణలో ఎలాంటి రాజీ ఉండదని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రత్యేక పర్యవేక్షణలో ఆక్రమణలను అడ్డుకోవడంతో పాటు, ఏళ్ల తరబడి న్యాయస్థానాల్లో పెండింగ్‌లో ఉన్న భూ వివాదాల పరిష్కారానికి ప్రభుత్వం చర్యలు చేపట్టిందని తెలిపారు. (వివరాలు 2లో..)



నాడు మేం కాపాడాం.. నేడు అమ్మకానికి...!

మియాపూర్ భూములు రక్షించింది బీఆర్ఎస్సే

ఎనిమిదేళ్ల న్యాయపోరాటం మాదేనన్న హరీశ్

మియాపూర్‌లోని 550 ఎకరాల ప్రభుత్వ భూములను సుప్రీంకోర్టులో పోరాడి కాపాడింది బీఆర్ఎస్ ప్రభుత్వమేనని, ఇప్పుడు వాటిని అమ్మేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం సిద్ధమవుతోందని మాజీ మంత్రి, బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్ రావు ఆరోపించారు. ఈ భూములపై సుప్రీంకోర్టు తీర్పు అనంతరం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలు వాస్తవాలకు విరుద్ధమని విమర్శించారు. (వివరాలు 2లో..)



మియాపూర్ భూముల వేలం వద్దు

అభివృద్ధికి వినియోగించండన్న బీజేపీ

మియాపూర్‌లోని 550 ఎకరాల విలువైన ప్రభుత్వ భూములపై సుప్రీంకోర్టులో విజయం సాధించిన వెంటనే వాటిని వేలం వేసి విక్రయించాలన్న ప్రభుత్వ ఆలోచనను తెలంగాణ బీజేపీ అధ్యక్షుడు ఎన్. రాంచందర్ రావు తీవ్రంగా వ్యతిరేకించారు. ఈ భూములను ఉపాధి కల్పనకు, స్థానిక ప్రాంతాల అభివృద్ధికి వినియోగించకుండా అమ్మకానికి పెట్టడం ప్రభుత్వ రియల్ ఎస్టేట్ ధోరణిని బయటపెడుతోందని విమర్శించారు. ప్రజల ఆస్తులు విక్రయించడం సరైన నిర్ణయం కాదని ఆయన అభిప్రాయపడ్డారు. (2లో..)



2లో..

సచివాలయ భద్రతకు ఆక్టోపస్ మాక్ డ్రిల్

అత్యవసర పరిస్థితులపై 130 మందితో విన్యాసం







సచివాలయ భద్రతకు ఆక్టోపస్ మాక్ డ్రిల్

అత్యవసర పరిస్థితులపై 130 మందితో విన్యాసం

తెలంగాణ సచివాలయంలో ఆకస్మిక భద్రతా ముప్పులు ఎదురైతే వేగంగా స్పందించేందుకు ఆక్టోపస్ బృందం ఆధ్వర్యంలో అక్టోబర్ 30న ప్రత్యేక మాక్ డ్రిల్ నిర్వహించారు. ఆక్టోపస్ ఎకో స్వాట్ టీమ్ ఎస్ఓసీ/డీఎస్పీ బి. మరియదాసు నాయకత్వంలో జరిగిన ఈ విన్యాసంలో పోలీసులు, అగ్నిమాపక, ట్రాఫిక్, వైద్య, బాంబు నిర్వీర్య బృందాలు పాల్గొన్నాయి. మొత్తం 130 మంది సిబ్బంది ఇందులో భాగమయ్యారు. ఆక్టోపస్ నుంచి 45 మంది, తెలంగాణ స్పెషల్ పోలీస్ ఫోర్స్ నుంచి 36 మంది, సీజీఎస్ నుంచి 18 మంది, లా అండ్ ఆర్డర్ పోలీసుల నుంచి 10 మంది, ట్రాఫిక్ పోలీసుల నుంచి 10 మంది, అగ్నిమాపక శాఖ నుంచి 8 మంది, వైద్య బృందం నుంచి 6 మంది, బాంబు నిర్వీర్య బృందం, అసాల్ట్ డాగ్ విభాగం నుంచి 4 మంది పాల్గొన్నారు.

అత్యవసర స్పందనకు ప్రత్యేక శిక్షణ

సచివాలయంలో ఉగ్రవాద ముప్పు లేదా ఇతర అత్యవసర పరిస్థితులు తలెత్తితే వివిధ శాఖలు ఎంత వేగంగా, సమన్వయంతో పనిచేస్తాయో ఈ డ్రిల్ ద్వారా పరీక్షించారు. సన్నద్ధత, స్పందనా వేగం, కార్యాచరణ సామర్థ్యాలను అంచనా వేసి మరింత మెరుగుపరచడం ప్రధాన లక్ష్యం. ఆక్టోపస్ అడిషనల్ ఎస్పీ రఘునందన్ రావు, సచివాలయ సీఎస్ఓ దేవిదాస్, ఏసీపీ శంకర్, ఆక్టోపస్ డీఎస్పీ రామకృష్ణ, ట్రాఫిక్ ఏసీపీ మోహన్ రావు తదితర అధికారులు పాల్గొన్నారు. అత్యవసర సమయాల్లో ప్రాణ, ఆస్తి నష్టాన్ని నివారించేలా శాఖల మధ్య సమన్వయం పెంచేందుకు ఇలాంటి విన్యాసాలు క్రమం తప్పకుండా నిర్వహిస్తామని అధికారులు తెలిపారు.

కేసీఆర్ కుటుంబంపై సీఎం రేవంత్ గురి!

మియాపూర్ భూములపై హాట్ కామెంట్స్





మూడేళ్లలో లక్షన్నర కోట్ల ఆస్తుల రక్షణ

తెలంగాణలో ప్రభుత్వ భూముల పరిరక్షణ అంశం మరోసారి రాజకీయంగా వేడెక్కింది. మాజీ సీఎం కేసీఆర్, ఆయన కుటుంబ సభ్యులు ప్రభుత్వ భూములను ఆక్రమించేందుకు ప్రయత్నించారని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తీవ్ర ఆరోపణలు చేశారు. ఢిల్లీలో శుక్రవారం మాట్లాడుతూ, మియాపూర్‌లోని 550 ఎకరాలకు పైగా విలువైన భూములపై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును చారిత్రక విజయంగా అభివర్ణించారు. సుమారు రూ.50 వేల కోట్ల విలువైన ఈ భూములు ప్రభుత్వానివేనని హైకోర్టు, భూకబ్జాల కేసుల ప్రత్యేక న్యాయస్థానం ఇచ్చిన తీర్పులను సుప్రీంకోర్టు సమర్థించింది. 23 ఏళ్లుగా కొనసాగుతున్న న్యాయపోరాటానికి ఈ తీర్పుతో ముగింపు లభించిందన్నారు. ఈ వ్యవహారంలో కేసీఆర్, ఆయన బంధువు దామోదర్‌రావు, గోల్డ్‌స్టోన్ ప్రసాద్ పాత్ర ఉందంటూ ఆరోపించారు. దామోదర్‌రావుకు లగ్జరీ కార్లు లంచంగా ఇచ్చారని, కేసీఆర్‌కు నగదు రూపంలో ముడుపులు అందాయని విమర్శించారు.

కబ్జాల అడ్డుకట్టకు న్యాయపోరాటం

గత మూడేళ్లలో తమ ప్రభుత్వం సుమారు లక్షన్నర కోట్ల విలువైన ప్రభుత్వ ఆస్తులను కాపాడిందని రేవంత్‌రెడ్డి వెల్లడించారు. ఐఎంజీ భూములు, కంచ గచ్చిబౌలి, మామిడిపల్లి భూముల విషయంలో బీఆర్ఎస్ నేతలు ఆక్రమణలకు ప్రయత్నించారని ఆరోపించారు. గుర్రంగూడ అటవీ భూములపై కేటీఆర్ అనుచరుల ప్రమేయం ఉందని, ప్రభుత్వం సుప్రీంకోర్టులో పోరాడి వాటి అటవీ హోదాను కాపాడిందని తెలిపారు. మంచిరేవులలో రాయలసీమ బిల్డర్స్‌తో కలిసి 143 ఎకరాల ఆక్రమణకు ప్రయత్నించారని ఆరోపిస్తూ, ఆ భూమిలో పోలీసు సిబ్బంది పిల్లల కోసం పాఠశాల ఏర్పాటు చేసినట్లు చెప్పారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో 400 ఎకరాల అటవీ భూమితో పాటు భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని ప్రభుత్వ భూములను కూడా కాపాడినట్లు వివరించారు. ఎమ్మెల్యేగా, ఎంపీగా, టీపీసీసీ అధ్యక్షుడిగా ఉన్నప్పటి నుంచే ఈ అక్రమాలపై పోరాడానని, అందుకే రాజకీయ కక్షతో తనను జైలుకు పంపారని ఆరోపించారు.

అమ్మకంతో అభివృద్ధికి నిధులు

మియాపూర్ భూములను విక్రయించి వచ్చే ఆదాయాన్ని సాగునీరు, విద్య, వైద్య రంగాల అభివృద్ధికి వినియోగించే ప్రతిపాదనను ప్రభుత్వం పరిశీలిస్తోందని సీఎం తెలిపారు. ఈ అంశాన్ని మంత్రివర్గం ముందుంచనున్నట్లు వెల్లడించారు. వనరుల సమీకరణ కోసం ఏర్పాటు చేసిన మంత్రివర్గ ఉపసంఘం భూముల విక్రయం, నిధుల వినియోగంపై సిఫార్సులు చేయనుంది. విద్యాభివృద్ధికి ప్రాధాన్యం ఇస్తామని రేవంత్ స్పష్టం చేశారు. మియాపూర్ భూములపై కుట్రలు మానుకోవాలని కేసీఆర్, కేటీఆర్‌లకు సూచించారు. ప్రభుత్వ భూముల ఆక్రమణలపై శాసనసభకు వచ్చి చర్చించాలని బీఆర్ఎస్ నేతలకు సవాల్ విసిరారు. రెండు గ్రామాల మధ్య వివాదాన్ని కేసీఆర్ తనకు అనుకూలంగా ఉపయోగించుకున్నారని ఆరోపిస్తూ, ఆ ప్రాంతాన్ని శ్రీకాంతాచారి అమరవీరుల కాలనీగా అభివృద్ధి చేస్తామని ప్రకటించారు. ప్రభుత్వ ఆస్తుల పరిరక్షణ, వాటి ద్వారా అభివృద్ధికి నిధుల సమీకరణే తమ లక్ష్యమని ముఖ్యమంత్రి పేర్కొన్నారు.

హైస్పీడ్ కారిడార్లకు వేగంగా అనుమతులు



- కొత్త రైలు మార్గాలకు సీఎం ప్రతిపాదనలు
- రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్‌తో సమావేశం

తెలంగాణలో రైల్వే మౌలిక వసతుల విస్తరణకు కీలక ప్రాజెక్టులను త్వరగా పట్టాలెక్కించాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కేంద్రాన్ని కోరారు. శుక్రవారం ఢిల్లీలోని రైల్ భవన్‌లో రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్‌తో సమావేశమైన ఆయన, హైదరాబాద్-పుణె, హైదరాబాద్-బెంగళూరు, హైదరాబాద్-చెన్నై హైస్పీడ్ రైలు కారిడార్ల పనులను వేగవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు. కేంద్రం పంపిన ప్రతిపాదనలను పరిశీలించి కొన్ని మార్పులతో రాష్ట్ర ప్రభుత్వం తిరిగి పంపిందని వివరించారు. ప్రస్తుతం ఈ మూడు మార్గాలకు సంబంధించి భూసేకరణ ప్రారంభించలేదని, కేంద్రం తుది అలైన్‌మెంట్ ఆమోదించిన వెంటనే భూసేకరణ చేపడతామని స్పష్టం చేశారు. అలైన్‌మెంట్ ప్రక్రియను వీలైనంత త్వరగా పూర్తిచేసి ప్రాజెక్టులకు మార్గం సుగమం చేయాలని కోరారు.

కొత్త మార్గాలతో పారిశ్రామిక అభివృద్ధి

వికారాబాద్-కృష్ణా మధ్య 130 కిలోమీటర్ల కొత్త రైల్వే మార్గాన్ని వెంటనే మంజూరు చేయాలని సీఎం కోరారు. టేకల్‌కోడ్ పరిసరాల్లో భారీ సున్నపురాయి నిక్షేపాలు ఉన్నందున ఈ ప్రాంతాన్ని సిమెంట్, వస్త్ర పరిశ్రమల కేంద్రంగా అభివృద్ధి చేయాలని ప్రభుత్వం ప్రణాళికలు రూపొందించిందని తెలిపారు. హైదరాబాద్ చుట్టూ 360 కిలోమీటర్ల మేర నిర్మిస్తున్న ప్రాంతీయ రహదారి వలయానికి అనుసంధానంగా ప్రాంతీయ రైలు మార్గాన్ని ఏర్పాటు చేయాలని సూచించారు. డోర్నకల్-గద్వాల్, కల్వకుర్తి-మాచర్ల, కాచిగూడ-జగ్గయ్యపేట (250 కి.మీ.), పటాన్‌చెరు-ఆదిలాబాద్ (320కి.మీ.), బోధన్-లాతూర్ (175 కి.మీ.) రైలు మార్గాలతో పాటు అక్కన్నపేట బైపాస్ (8కి.మీ.)కు అనుమతులు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. ఈ మార్గాలు పారిశ్రామిక రవాణా, ప్రాంతీయ అనుసంధానంతో పాటు ఉపాధి అవకాశాలను పెంచుతాయని వివరించారు.

అనంతరంలో మెగా డిపోకు ప్రతిపాదన

దక్షిణ మధ్య రైల్వే చేపట్టనున్న భారీ కోచింగ్, సరకు రవాణా రైళ్ల నిర్వహణ కేంద్రాన్ని మహబూబాబాద్ సమీపంలోని అనంతరంలో ఏర్పాటు చేయాలని సీఎం కోరారు. ఈ ప్రాజెక్టుకు అవసరమైన 409 ఎకరాల ఒక గుంట భూమిని రైల్వే శాఖకు అప్పగించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే అంగీకరించిందని తెలిపారు. మెగా ఫ్లైట్ మెయింటెనెన్స్ డిపోకు త్వరగా అనుమతులు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో రాష్ట్ర మంత్రి వివేక్ వెంకటస్వామి, ఎంపీలు మల్లు రవి, వేం నరేందర్‌రెడ్డి, చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, బలరాం నాయక్, గడ్డం వంశీకృష్ణ, అనిల్‌కుమార్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు. రాష్ట్ర ప్రభుత్వ ఉన్నతాధికారులు కూడా సమావేశంలో పాల్గొని రైల్వే ప్రాజెక్టుల ప్రతిపాదనలను కేంద్ర మంత్రి దృష్టికి తీసుకెళ్లారు.

మియాపూర్ భూముల వేలం వద్దు

అభివృద్ధికి వినియోగించండన్న బీజేపీ



మియాపూర్‌లోని 550 ఎకరాల విలువైన ప్రభుత్వ భూములపై సుప్రీంకోర్టులో విజయం సాధించిన వెంటనే వాటిని వేలం వేసి విక్రయించాలన్న ప్రభుత్వ ఆలోచనను తెలంగాణ బీజేపీ అధ్యక్షుడు ఎన్. రాంచందర్ రావు తీవ్రంగా వ్యతిరేకించారు. ఈ భూములను ఉపాధి కల్పనకు, స్థానిక ప్రాంతాల అభివృద్ధికి వినియోగించకుండా అమ్మకానికి పెట్టడం ప్రభుత్వ రియల్ ఎస్టేట్ ధోరణిని బయటపెడుతోందని విమర్శించారు. ప్రజల ఆస్తులుగా ఉన్న విలువైన భూములను తక్షణ ఆదాయం కోసం విక్రయించడం సరైన నిర్ణయం కాదని ఆయన అభిప్రాయపడ్డారు.

భవిష్యత్ అవసరాలపై ఆలోచించాలి

ప్రభుత్వ భూములను ఇలా వరుసగా అమ్ముకుంటూ పోతే, భవిష్యత్తులో ఆర్థిక ఇబ్బందులు ఎదురైనప్పుడు పాలనను ఎలా కొనసాగిస్తారని రాంచందర్ రావు ప్రశ్నించారు. దీర్ఘకాలిక అవసరాలను పరిగణనలోకి తీసుకోకుండా భూముల విక్రయానికి తొందరపడటం సరైన విధానం కాదన్నారు. మియాపూర్ భూములను అమ్మడం కాకుండా ప్రజలకు ఉపాధి, ప్రాంతానికి అభివృద్ధి కలిగించేలా వినియోగించాలి అని డిమాండ్ చేశారు. ప్రభుత్వ భూముల వేలం నిర్ణయాన్ని బీజేపీ తీవ్రంగా వ్యతిరేకిస్తోందని స్పష్టం చేశారు.

ప్రభుత్వ భూములపై ఆక్రమణలకు ఇక చెక్!

- కంచె గచ్చిబౌలి, మియాపూర్ వరకు విజయాలు
- న్యాయపోరాటంలో ప్రభుత్వానికి ఊరట: పొంగులేటి



ప్రభుత్వ భూముల పరిరక్షణలో ఎలాంటి రాజీ ఉండదని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రత్యేక పర్యవేక్షణలో ఆక్రమణలను అడ్డుకోవడంతో పాటు, ఏళ్ల తరబడి న్యాయస్థానాల్లో పెండింగ్‌లో ఉన్న భూ వివాదాల పరిష్కారానికి ప్రభుత్వం చర్యలు చేపట్టిందని తెలిపారు. గతంలో అధికారుల మధ్య సమన్వయం, పర్యవేక్షణ లోపాలతో విలువైన భూములపై వివాదాలు కొనసాగాయని పేర్కొన్నారు. ఇప్పుడు పాత రెవెన్యూ రికార్డులు, ఆధారాలను పరిశీలిస్తూ ప్రభుత్వ హక్కులను నిలబెట్టేందుకు రెవెన్యూ, న్యాయశాఖలు సమన్వయంతో పనిచేస్తున్నాయని వివరించారు. సుప్రీంకోర్టులోకంచె గచ్చిబౌలిలోని 400ఎకరాల భూమిపై ప్రభుత్వానికి అనుకూలంగా తీర్పు రావడం, తాజాగా మియాపూర్ భూముల వివాదంలోనూ విజయం సాధించడం ఈ కృషికి నిదర్శనమని అన్నారు.

ప్రజల ఆస్తులే.. భవిష్యత్ తరాల సంపద

రెండు దశాబ్దాలుగా వివాదాల్లో ఉన్న విలువైన భూములను న్యాయపోరాటంతో తిరిగి ప్రభుత్వ హక్కుల్లోకి తీసుకురావడంలో కీలక పాత్ర పోషించిన రెవెన్యూ అధికారులు, న్యాయ నిపుణులు, ప్రభుత్వ న్యాయవాదులను మంత్రి ప్రత్యేకంగా అభినందించారు. ప్రభుత్వ భూములు ఏ ఒక్క వ్యక్తికో, సంస్థకో చెందినవి కావని, అవి రాష్ట్ర ప్రజలందరి ఉమ్మడి ఆస్తి అని స్పష్టం చేశారు. వాటిని కాపాడటం ప్రస్తుత తరంతో పాటు భవిష్యత్ తరాల ప్రయోజనాలకు అవసరమన్నారు. ఆక్రమణలకు పాల్పడినా, అక్రమంగా హక్కులు పొందేందుకు ప్రయత్నించినా ఉపేక్షించబోమని హెచ్చరించారు. భూముల పరిరక్షణకు క్షేత్రస్థాయిలో చర్యలతో పాటు న్యాయస్థానాల్లోనూ పోరాటం కొనసాగిస్తామని పొంగులేటి స్పష్టం చేశారు.



బియ్యం దందాపై కదిలిన సర్కార్

- అక్రమ నిల్వలపై అధికారుల దాడులు
- నిల్వల నుంచి తూకం దాకా అక్రమాలే

విజిలెన్స్, తూనికలు కొలతల శాఖ, జీఎస్టీ అధికారులతో కూడిన బృందాలు మంగళహాట్, మలక్‌పేట, అమీర్‌పేట, కర్మన్‌ఘాట్ తదితర ప్రాంతాల్లో రిటైల్, హోల్‌సేల్ వ్యాపారుల గోదాములు, దుకాణాలను తనిఖీ చేశాయి. కృత్రిమ కొరత సృష్టించి ధరలు పెంచేందుకు బియ్యాన్ని అక్రమంగా నిల్వ చేస్తున్నారనే అనుమానంతో ఈ దాడులు చేపట్టారు. రెండు రోజుల తనిఖీల్లో నిల్వల అక్రమాలతో పాటు వినియోగదారులను మోసం చేస్తున్న పలు విధానాలు వెలుగులోకి వచ్చాయి.

తూకంలో మోసం.. పన్నుల్లోనూ ఎగవేత

కర్మన్‌ఘాట్‌లో నిర్వహించిన తనిఖీల్లో బియ్యం బస్తాలపై ముద్రించిన బరువుకు, లోపల ఉన్న బియ్యం పరిమాణానికి తేడా ఉన్నట్లు అధికారులు గుర్తించారు. 26 కిలోలుగా ముద్రించిన బస్తాల్లో 25 కిలోల బియ్యమే ఉన్నట్లు తేల్చారు. బరువు వివరాల్లో మార్పులు చేసి జీఎస్టీ ఎగవేతకు పాల్పడుతున్నారనే అనుమానాలు వ్యక్తమయ్యాయి. కొన్ని దుకాణాలు సరైన వ్యాపార అనుమతులు లేకుండానే నిర్వహిస్తున్నట్లు గుర్తించారు. అనుమానాస్పద బియ్యం బ్రాండ్లను స్వాధీనం చేసుకుని నమూనాలను పరీక్షలకు పంపించారు. టాస్క్‌ఫోర్స్ అధికారి శశిధర్ రాజు ఈ అక్రమాలను ధ్రువీకరిస్తూ, నిబంధనలు ఉల్లంఘించిన వారిపై క్రిమినల్, చట్టపరమైన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

పేరులేని బ్రాండ్లతో అధిక ధరలకు విక్రయాలు

కృష్ణానగర్ కమలాపురి కాలనీలోని నీలం రైస్ డిపోలో జరిగిన తనిఖీలు బియ్యం వ్యాపారంలో సాగుతున్న అక్రమాల తీరును బయటపెట్టాయి. సరైన గుర్తింపు లేని బ్రాండ్లతో బియ్యాన్ని ఆకర్షణీయమైన ప్యాకెట్లలో నింపి అధిక ధరలకు విక్రయిస్తున్నట్లు అధికారులు గుర్తించారు. పీడీఎస్ బియ్యం రీసైక్లింగ్, నాణ్యతలోపాలు, సన్నబియ్యం పేరుతో తప్పుడు ప్రచారం, ప్యాకింగ్‌లో నిబంధనల ఉల్లంఘన వంటి అంశాలపై దృష్టి సారించారు. ప్రభుత్వం పేదలకు అందించే రేషన్ బియ్యాన్ని పక్కదారి పట్టించి తిరిగి మార్కెట్‌లో విక్రయించే వ్యవహారాలపైనా అధికారులు దర్యాప్తు చేస్తున్నారు. నిల్వల లెక్కలు, కొనుగోళ్ల వివరాలు, విక్రయాల రికార్డులను పరిశీలిస్తున్నారు.

నాడు మేం కాపాడాం.. నేడు అమ్మకానికి...!

- మియాపూర్ భూములు రక్షించింది బీఆర్ఎస్సే
- ఎనిమిదేళ్ల న్యాయపోరాటం మాదేనన్న హరీశ్



మియాపూర్‌లోని 550 ఎకరాల ప్రభుత్వ భూములను సుప్రీంకోర్టులో పోరాడి కాపాడింది బీఆర్ఎస్ ప్రభుత్వమేనని, ఇప్పుడు వాటిని అమ్మేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం సిద్ధమవుతోందని మాజీ మంత్రి, బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్ రావు ఆరోపించారు. ఈ భూములపై సుప్రీంకోర్టు తీర్పు అనంతరం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలు వాస్తవాలకు విరుద్ధమని విమర్శించారు. 2003లోనే సుప్రీంకోర్టుకు చేరిన ఈ వివాదంపై తెలంగాణ ఏర్పడిన తర్వాత కేసీఆర్ ప్రత్యేక దృష్టి పెట్టారని తెలిపారు. 2015లో సీనియర్ న్యాయవాది సీ.ఎస్. వైద్యనాథన్‌ను నియమించి, 2023 వరకు ఎనిమిదేళ్ల పాటు పిటిషన్లు, అఫిడవిట్లు, ఆధారాలతో ప్రభుత్వం తరపున న్యాయపోరాటం సాగించామని వివరించారు.

ట్రినిటీ కేసు తీర్పు కీలక ఆధారం

గోల్డ్‌స్టోన్ ప్రసాద్‌కు సంబంధించిన ట్రినిటీ ఇన్‌ఫ్రావెంచర్స్ కేసులో 2023 జూన్ 15న బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలోనే తెలంగాణకు అనుకూలంగా తీర్పు వచ్చిందని హరీశ్ రావు గుర్తుచేశారు. ఆ కేసులో వెల్లడైన చట్టపరమైన అంశాలు మియాపూర్ భూముల తుది తీర్పుకు కీలక ఆధారమయ్యాయని పేర్కొన్నారు. సుప్రీంకోర్టు రికార్డులు అందుబాటులో ఉన్నప్పుడు, ప్రస్తుత ప్రభుత్వం తానే భూములను కాపాడినట్లు ప్రచారం చేసుకోవడం సరికాదని అన్నారు.

భూముల విక్రయంపై అభ్యంతరం

మియాపూర్ భూముల విలువ రూ.60 వేల కోట్లకు పైగా ఉంటుందని ముఖ్యమంత్రే ప్రకటించారని హరీశ్ రావు పేర్కొన్నారు. ఇంతటి విలువైన ప్రభుత్వ ఆస్తులను విక్రయించేందుకే బీఆర్ఎస్‌పై ఆరోపణలు చేస్తున్నారని విమర్శించారు. ప్రజల భవిష్యత్తు అవసరాలకు ఉపయోగపడాల్సిన భూములను అమ్మే ఆలోచనను విరమించుకోవాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ భూములను ప్రజా ప్రయోజనాలకే వినియోగించాలని, విక్రయ ప్రయత్నాలను బీఆర్ఎస్ వ్యతిరేకిస్తుందని స్పష్టం చేశారు.

మూడు ట్రిలియన్ డాలర్ల లక్ష్యం

- సమ్మిళిత అభివృద్ధితోనే సంపద
- ప్రజల జీవితాల్లో మార్పు: భట్టి



తెలంగాణను 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దే సామర్థ్యం రాష్ట్రానికి ఉందని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అన్నారు. హైదరాబాద్‌లోని డాక్టర్ ఎం.సి.ఆర్. మానవ వనరుల అభివృద్ధి సంస్థ స్వర్ణోత్సవాల సందర్భంగా నిర్వహించిన జాతీయ సదస్సును ప్రారంభించిన ఆయన, ఆర్థిక వృద్ధి గణాంకాలకే పరిమితం కాకుండా సామాన్యుల జీవన ప్రమాణాలను మెరుగుపరచాలని స్పష్టం చేశారు. యువతకు ఉపాధి, రైతులకు భరోసా, ప్రజలకు మెరుగైన వైద్యం అందాలని పేర్కొన్నారు. హైదరాబాద్‌కే పరిమితమైన అభివృద్ధి జిల్లాలకూ విస్తరించాలని, పారిశ్రామిక అవకాశాలు, మార్కెట్ అనుసంధానాలు పెంచాలని సూచించారు.

పర్యావరణం, ప్రజలే అభివృద్ధికి ప్రాధాన్యం

చెరువులు, నీటి వనరులను దెబ్బతీసే అశాస్త్రీయ పట్టణ విస్తరణ భవిష్యత్తుకు ముప్పని హెచ్చరించారు. మూసీ పునరుజ్జీవనం, ఫ్యూచర్ సిటీ ప్రాజెక్టుల్లో పర్యావరణ పరిరక్షణ, ప్రజారోగ్యం, బాధిత కుటుంబాల పునరావాసానికి ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. ప్రభుత్వ శాఖలు సమన్వయంతో పనిచేస్తూ ప్రజల సమయాన్ని ఆదా చేసే సేవలు అందించాలనిసూచించారు.మహాలక్ష్మి,గృహజ్యోతి, ఇందిరమ్మ ఇళ్లు, యంగ్ ఇండియా పాఠశాలలు, సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రులు వంటి పథకాలను ప్రస్తావించారు. సదస్సులో 12 రాష్ట్రాల నుంచి సుమారు 200 మంది నిపుణులు, పరిశోధకులు పాల్గొన్నారు.



చివరి శ్వాస వరకు ప్రజాసేవే

- దేశం కష్టాల్లో ఉంటే సంబరాలా?
- రైతుల సంక్షేమానికి రూ.50 లక్షల కోట్లు
- విమర్శలపై ప్రధాని మోదీ ఆగ్రహం

దేశానికి సంక్షోభం ఎదురైనప్పుడు కొందరు ప్రతిపక్ష నేతలు ప్రజల్లో భయాందోళనలు సృష్టిస్తూ రాజకీయ లబ్ధి పొందాలని చూస్తున్నారని ప్రధాని నరేంద్ర మోదీ విమర్శించారు. పశ్చిమాసియాలో కొనసాగుతున్న యుద్ధం నేపథ్యంలో ఎరువులు, వంటగ్యాస్ కొరత ఏర్పడుతుందంటూ తప్పుడు ప్రచారం చేస్తున్నారని ఆరోపించారు. గుజరాత్‌లోని బనస్కాంత జిల్లా భిల్డిలో శుక్రవారం జరిగిన బహిరంగ సభలో ఆయన మాట్లాడుతూ, రైతులు, యువత, మహిళలు అభివృద్ధి చెందిన భారత్ నిర్మాణానికి కృషి చేస్తున్నారని చెప్పారు. దేశ పురోగతిని చూసి కొందరు అసహనం వ్యక్తం చేస్తున్నారని వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ఇటీవల చేసిన వివాదాస్పద వ్యాఖ్యల నేపథ్యంలో మోదీ స్పందిస్తూ, తన చివరి శ్వాస వరకు భారత ప్రజలకు సేవ చేస్తూనే ఉంటానని ప్రకటించారు. ఈ సందర్భంగా రూ.14 వేల కోట్ల అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేశారు.

ఎరువుల ధరల భారం ప్రభుత్వానిదే

అంతర్జాతీయ మార్కెట్‌లో యూరియా, డీఏపీ ధరలు భారీగా పెరిగినా భారత రైతులపై ఆ భారం పడకుండా ప్రభుత్వం చర్యలు తీసుకుందని మోదీ తెలిపారు. ప్రపంచ మార్కెట్‌లో యూరియా బస్తా ధర రూ.3,000 వరకు ఉన్నప్పటికీ భారత రైతులకు రూ.300 లోపే అందుతోందన్నారు. డీఏపీ బస్తా అంతర్జాతీయ ధర రూ.5,000 దాటినా దేశంలో రూ.1,350కే సరఫరా చేస్తున్నట్లు వివరించారు. రైతుల కోసం ప్రభుత్వం సుమారు రూ.16 లక్షల కోట్లను ఎరువుల సబ్సిడీకి ఖర్చు చేసిందన్నారు. కనీస మద్దతు ధర ద్వారా గోధుమ, వరి రైతులకు గత 12 ఏళ్లలో రూ.24 లక్షల కోట్లు అందించామని చెప్పారు. పంటల బీమా పథకం ద్వారా రూ.2 లక్షల కోట్లకు పైగా పరిహారం చెల్లించినట్లు వెల్లడించారు.

పీఎం కిసాన్ నిధులు విడుదల

ప్రధానమంత్రి కిసాన్ సమ్మాన్ నిధి 24వ విడత కింద సుమారు 10 కోట్ల మంది రైతుల ఖాతాలకు రూ.18 వేల కోట్లకు పైగా జమ చేసినట్లు మోదీ ప్రకటించారు. 2019లో ప్రారంభమైన ఈ పథకం ద్వారా ఇప్పటివరకు చిన్న రైతులకు రూ.4.5 లక్షల కోట్లకు పైగా నేరుగా అందించామని తెలిపారు. పలు సంక్షేమ పథకాల ద్వారా రైతులు పొందిన ప్రయోజనాలు, ఆదా కలిపి రూ.50 లక్షల కోట్లకు పైగా ఉన్నాయని పేర్కొన్నారు. పీఎం కుసుమ్ పథకం కింద దాదాపు 12 లక్షల సౌర విద్యుత్ పంపులు ఏర్పాటు చేసినట్లు వివరించారు. సభలో గుజరాత్ ఉప ముఖ్యమంత్రి హర్ష్ సంఘవి మాట్లాడుతూ మోదీకి దేశవ్యాప్తంగా ప్రజల మద్దతు ఉందన్నారు. ఖర్గే వ్యాఖ్యలకు ప్రతిగా వినిపిస్తున్న 'మోదీ ఎక్కడికీ వెళ్లరు' నినాదాన్ని ప్రస్తావించారు. రైతు సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలే తమ ప్రభుత్వ ప్రాధాన్యాలని మోదీ ఈ సభ ద్వారా స్పష్టం చేశారు.



సమ్మతితో జరిగిన శృంగారం

నేరం కాదు

సంబంధం చెడితే కేసుగా మార్చలేరు

విఫల ప్రేమకు అత్యాచారం ముద్ర తగదు!

పరస్పర అంగీకారంతో కొనసాగిన శారీరక సంబంధాన్ని, ఆ తర్వాత ప్రేమ బంధం విఫలమైందనే కారణంతో అత్యాచారంగా పరిగణించలేమని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. సంబంధం ముగిసిన తర్వాత గతంలో జరిగిన శారీరక సాన్నిహిత్యాన్ని నేరంగా చిత్రీకరించే ధోరణి పెరుగుతోందని ఆందోళన వ్యక్తం చేసింది. జస్టిస్ బి.వి. నాగరత్న నేతృత్వంలోని ధర్మాసనం ఈ కీలక వ్యాఖ్యలు చేసింది. కేరళకు చెందిన ఓ వ్యక్తిపై ఏడేళ్ల ప్రేమ సంబంధంలో పలుమార్లు అత్యాచారానికి పాల్పడ్డాడనే ఆరోపణలతో కేసు నమోదైంది. తనకు గతంలోనే వివాహమై ఇద్దరు పిల్లలు ఉన్న విషయాన్ని బాధితురాలికి తెలియకుండా దాచాడన్నది ప్రధాన ఆరోపణ. ఈ కేసు విచారణ సందర్భంగా సమ్మతి, మోసం మధ్య ఉన్న తేడాను న్యాయస్థానం వివరించింది.

మోసంతో పొందిన సమ్మతికి రక్షణ లేదు

శారీరక సంబంధానికి మహిళ అంగీకారం మోసం, తప్పుడు హామీల ద్వారా పొందితే అది వేరే అంశమని ధర్మాసనం పేర్కొంది. అయితే ఇద్దరి అంగీకారంతో ఏర్పడిన సంబంధం తర్వాత విఫలమైతే, గతంలో ఇచ్చిన సమ్మతిని కేవలం పశ్చాత్తాపంతో నేరంగా మార్చలేమని స్పష్టం చేసింది. సమ్మతి లేకుండా జరిగిన లైంగిక చర్యకు చట్టం రక్షణ కల్పించదు. అదే సమయంలో సమ్మతితో జరిగిన సంబంధాన్ని విడిపోయిన తర్వాత అత్యాచారంగా చిత్రీకరించడం కూడా సమర్థనీయం కాదు అని పేర్కొంది. సంబంధంలో ఉన్నప్పుడు జరిగిన శారీరక సాన్నిహిత్యాన్ని, ఆ బంధం కొనసాగడం లేదనే ఒక్క కారణంతో నేరంగా ముద్ర వేయడం సరికాదని తెలిపింది.

తప్పుడు కేసులతో న్యాయవ్యవస్థకు భారం


విఫలమైన ప్రేమ సంబంధాలను క్రిమినల్ కేసులుగా మార్చే ధోరణి ఆందోళనకరమని జస్టిస్ నాగరత్న వ్యాఖ్యానించారు. అత్యాచారం తీవ్రమైన నేరమని, నిజమైన లైంగిక దాడి, బలవంతం, సమ్మతిని మోసంతో పొందడం వంటి సందర్భాల్లోనే చట్టాన్ని కఠినంగా అమలు చేయాలని సూచించారు. ప్రతి విఫల సంబంధం అత్యాచారం కేసుగా మారితే అసలు నేర తీవ్రత తగ్గిపోవడంతో పాటు ఆరోపణలు ఎదుర్కొనే వ్యక్తులు తీవ్ర మానసిక, సామాజిక ఇబ్బందులు ఎదుర్కొంటారని పేర్కొన్నారు. అలాంటి కేసులు వ్యక్తుల ప్రతిష్ఠకు కోలుకోలేని నష్టం కలిగిస్తాయని అభిప్రాయపడ్డారు.

నిజమైన బాధితులకు న్యాయం ముఖ్యం

మరోవైపు అత్యాచారం అత్యంత తక్కువగా నమోదయ్యే నేరాల్లో ఒకటని, మహిళల శారీరక స్వేచ్ఛ, గౌరవానికి సంబంధించిన కీలక అంశమని సుప్రీంకోర్టు గుర్తుచేసింది. కొన్ని సందర్భాల్లో చట్ట నిబంధనల దుర్వినియోగం జరుగుతున్నంత మాత్రాన నిజమైన బాధితుల ఫిర్యాదులను తక్కువగా చూడకూడదని స్పష్టం చేసింది. వాస్తవంగా లైంగిక దాడి జరిగిన సందర్భాల్లో బాధితులకు న్యాయం జరిగేలా దర్యాప్తు, విచారణ వేగంగా సాగాలని సూచించింది. సంబంధాలు విఫలమైనప్పుడు ప్రతీకారం తీర్చుకునేందుకు న్యాయవ్యవస్థను వేదికగా మార్చకూడదని, అదే సమయంలో నిజమైన లైంగిక నేరాలపై రాజీ లేకుండా చర్యలు తీసుకోవాలని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది.

నిరసన జ్వాల

- సీఈసీపై విపక్షాల సమరం
- ఓటు చోరీ ఆరోపణలపై పోరు
- నవంబర్ 1న చలో ఢిల్లీ ర్యాలీ
- జ్ఞానేశ్‌పై నేడు బహిరంగ అభిశంసన



ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్‌పై ఇండియా కూటమి చేపట్టాలని నిర్ణయించిన బహిరంగ అభిశంసన కార్యక్రమం వర్షాల కారణంగా ఒకరోజు వాయిదా పడింది. తొలుత అక్టోబర్ 30న నిర్వహించాల్సిన ఈ కార్యక్రమాన్ని అక్టోబర్ 31కి మార్చినట్లు లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ ప్రకటించారు. శనివారం మధ్యాహ్నం 2.30 గంటలకు అదే సమయంలో కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే నివాసంలో జరిగిన విపక్ష నేతల సమావేశం అనంతరం ఈ నిర్ణయాన్ని వెల్లడించారు. ఎన్నికల వ్యవస్థపై వస్తున్న ఆరోపణల నేపథ్యంలో కేంద్ర ఎన్నికల సంఘం నాయకత్వాన్ని నిలదీయడమే ఈ కార్యక్రమం లక్ష్యమని విపక్షాలు చెబుతున్నాయి.

నవంబర్ 1న చలో ఢిల్లీ

బహిరంగ అభిశంసనతో పాటు ప్రజా ఉద్యమాన్ని ఉధృతం చేసేందుకు నవంబర్ 1న చలో ఢిల్లీ మార్చ్ నిర్వహించాలని ఇండియా కూటమి నిర్ణయించింది. మధ్యాహ్నం 12 గంటలకు మింటో రోడ్-కనాట్ ప్లేస్ కూడలి నుంచి ప్రారంభమయ్యే ప్రదర్శన రాంలీలా మైదానానికి చేరుకోనుంది. అక్కడ భారీ బహిరంగ సభ నిర్వహించనున్నారు. ఓటర్ల జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియలో ఓట్ల తొలగింపు జరుగుతోందంటూ విపక్షాలు చేస్తున్న ఆరోపణలపై ఈ సభలో గళమెత్తనున్నారు. ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలన్న డిమాండ్‌ను కూడా ఈ వేదికపై వినిపించనున్నారు.

ప్రజలను అడ్డుకుంటున్నారు

ఢిల్లీ సభకు ప్రజలు చేరుకోకుండా కేంద్ర హోంమంత్రి అమిత్ షా అడ్డంకులు సృష్టిస్తున్నారని రాహుల్ గాంధీ ఆరోపించారు. తమ పార్టీ కార్యకర్తలతో పాటు సామాన్యులను కూడా నిలువరిస్తున్నారని విమర్శించారు. దేశంలో లక్షలాది మంది ఓటుహక్కు కోల్పోతున్నారనే ఆందోళన ప్రజల్లో ఉందని, రాజ్యాంగాన్ని కాపాడాలనుకునే ప్రతి ఒక్కరూ ఈ ఉద్యమంలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. ప్రధాని నరేంద్ర మోదీ, అమిత్ షా, ఎన్నికల ప్రధాన కమిషనర్ వ్యవహారశైలిపై ఆయన తీవ్ర విమర్శలు చేశారు. అయితే ఇవన్నీ విపక్షాల ఆరోపణలేనని, వాటిపై సంబంధిత సంస్థల స్పందన కీలకం కానుంది.

రాష్ట్రపతిని కలిసే యోచన

నవంబర్ 1 సభతో ఉద్యమాన్ని ముగించకుండా తదుపరి కార్యాచరణ చేపట్టాలని ఇండియా కూటమి నేతలు చర్చించారు. ఓట్ల చోరీకి సంబంధించిన ఆధారాలతో రాష్ట్రపతిని కలిసి ఫిర్యాదు చేయాలనే ప్రతిపాదన కూడా సమావేశంలో ప్రస్తావనకు వచ్చింది. తృణమూల్ కాంగ్రెస్ నేత డెరెక్ ఓబ్రియన్ పౌరసమాజ సంస్థలు, విద్యార్థులు, యువత, కార్మికులు, మహిళలు ఉద్యమంలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. సమాజ్‌వాదీ పార్టీ నేత అఖిలేశ్ యాదవ్ కూడా ర్యాలీలో పాల్గొంటారని ఎంపీ ధర్మేంద్ర యాదవ్ వెల్లడించారు. పార్టీలకతీతంగా ప్రజా సంఘాలు, విద్యార్థి సంస్థలను కలుపుకొని ఉద్యమాన్ని విస్తరించాలన్నది విపక్షాల వ్యూహంగా కనిపిస్తోంది.

అమిత్ షాపై విమర్శలు

ఆరోపణలకు ఆధారాలేవి!?

- నిరూపించాలని బీజేపీ సవాల్
- విపక్షాల మధ్య ఐక్యత లేదని ఎద్దేవా!



ఢిల్లీలో నవంబర్ 1న నిర్వహించనున్న ఇండియా కూటమి నిరసన ర్యాలీకి ఇతర రాష్ట్రాల నుంచి వచ్చే ప్రజలను కేంద్ర హోంమంత్రి అమిత్ షా అడ్డుకుంటున్నారన్న రాహుల్ గాంధీ ఆరోపణలను బీజేపీ తీవ్రంగా ఖండించింది. ఈ ఆరోపణలకు ఆధారాలు చూపాలని బీజేపీ ఎంపీ, జాతీయ అధికార ప్రతినిధి సంబిత్ పాత్ర సవాల్ విసిరారు. ఎక్కడ అడ్డుకున్నారు? ఎవరు అడ్డుకున్నారు? ఏ ప్రాంతంలో ఆంక్షలు విధించారు? బాధితులెవరు? అనే వివరాలు వెల్లడించాలని డిమాండ్ చేశారు. ఆధారాలు లేకుండా దేశంలో గందరగోళం సృష్టించే ప్రయత్నం చేయవద్దని హితవు పలికారు. రాజకీయ ప్రయోజనాల కోసం అసత్య ఆరోపణలు చేస్తున్నారని విమర్శించారు.

వాయిదాపై విపక్షాలకు చురకలు

కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే నివాసంలో అక్టోబర్ 30న నిర్వహించాల్సిన బహిరంగ అభిశంసన తరహా కార్యక్రమం వాయిదా పడటాన్ని సంబిత్ పాత్ర తప్పుబట్టారు. వర్షాల కారణంగా కార్యక్రమాన్ని వాయిదా వేసినట్లు ఇండియా కూటమి ప్రకటించగా, బీజేపీ మాత్రం ఇది విపక్షాల సంస్థాగత సామర్థ్యలేమికి నిదర్శనమని ఎద్దేవా చేసింది. కుటుంబ రాజకీయాలకు ప్రాధాన్యమిచ్చే పార్టీలన్నీ ఎన్నికల సమయంలో చేతులు కలిపినా, ఆ ఐక్యత ఎక్కువ కాలం కొనసాగదం లేదని విమర్శించారు. ఆమ్ ఆద్మీ పార్టీ కూటమి నుంచి వైదొలగడాన్ని ప్రస్తావించారు. ఉత్తరప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికల సమయంలో కాంగ్రెస్, సమాజ్‌వాదీ పార్టీ మధ్య సీట్ల పంపకంపై విభేదాలు తప్పవని వ్యాఖ్యానించారు.

ఓట్ల చోరీ ఆరోపణలపై ప్రశ్నలు

ఉత్తరప్రదేశ్ శాసనమండలి ఎన్నికల్లో అక్రమాలు జరిగాయని ఆరోపిస్తూ, ఐదు స్థానాల్లో గెలిచినప్పుడు సమాజ్‌వాదీ పార్టీ సంబరాలు చేసుకోవడం ఎలా సాధ్యమని సంబిత్ పాత్ర ప్రశ్నించారు. అక్రమాలు జరిగితే ఫిర్యాదు చేయాలని సూచించారు. ఓట్ల చోరీ ఆరోపణలను గతంలోనే సుప్రీంకోర్టు పరిశీలించిందని, అయినా అదే అంశాన్ని పదేపదే ప్రస్తావిస్తూ రాంలీలా మైదానంలో సభలు నిర్వహించడం ద్వారా ప్రజల్లో గందరగోళం సృష్టిస్తున్నారని విమర్శించారు. ఓటర్ల జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ, ఎన్నికల పారదర్శకతపై విపక్షాలు చేస్తున్న ఆరోపణలకు రాజకీయంగా సమాధానం చెప్పడంతో పాటు ఆధారాల విషయంలోనూ స్పష్టత ఇవ్వాలని బీజేపీ డిమాండ్ చేస్తోంది.

ఓట్ల తొలగింపు దందాపై గురి

- ఫారం-7 దుర్వినియోగంపై న్యాయస్థానం ఆరా
- నివేదిక సమర్పించాలని ఈసీకి ఆదేశాలు
- ఫేక్ దరఖాస్తులపై సుప్రీం కోర్టు ఆగ్రహం



ఓటర్ల జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ (సర్) ప్రక్రియలో ఓట్ల తొలగింపునకు ఉపయోగించే ఫారం7 దరఖాస్తుల దుర్వినియోగం ఆరోపణలపై సుప్రీంకోర్టు తీవ్రంగా స్పందించింది. ఉత్తరప్రదేశ్‌లో నకిలీ దరఖాస్తులు పెద్దఎత్తున సమర్పించారన్న కాంగ్రెస్ ఎంపీ తనూజ్ పునియా పిటిషన్‌పై విచారణ చేపట్టిన సీజేఐ జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలోని ధర్మాసనం, ఈ వ్యవహారంపై పరిశీలించి చర్యలు తీసుకోవాలని ఎన్నికల సంఘాన్ని ఆదేశించింది. ఫారం7 దుర్వినియోగంపై అవసరమైన చర్యలు తీసుకుని, అనుసరణ నివేదిక సమర్పించాలని (కంప్లయన్స్ రిపోర్ట్) స్పష్టం చేసింది. నకిలీ దరఖాస్తులు, తప్పుడు వివరాలు, సంతకాల ఫోర్జరీతో ఓటర్ల పేర్లు తొలగించే ప్రయత్నాలు ప్రజాస్వామ్య ప్రక్రియపై అనుమానాలు పెంచుతున్నాయని పిటిషనర్ తరపు న్యాయవాదులు వాదించారు.

తప్పుగా వచ్చిన దరఖాస్తులు తిరస్కరించాం

ఉత్తరప్రదేశ్ సర్ సమయంలో తప్పుడు ఫారం7 దరఖాస్తులు గుర్తించినప్పటికీ, నిబంధనలకు విరుద్ధంగా ఉన్న ఒక్క దరఖాస్తును కూడా ఆమోదించలేదని ఎన్నికల సంఘం సుప్రీంకోర్టుకు తెలిపింది. వాటిని గుర్తించిన వెంటనే అధికారులు సరిదిద్దే చర్యలు చేపట్టారని ఈసీ తరపు సీనియర్ న్యాయవాది దామా శేషాద్రి నాయుడు వివరించారు. హటా అసెంబ్లీ నియోజకవర్గంలో 32 మంది ఓటర్ల పేర్లు తొలగించేందుకు ఫారాలు సమర్పించగా, వాటిలో రెండు ఫారాలపై బూత్ స్థాయి అధికారి సంతకం ఉన్నట్లు పిటిషనర్ తరపు న్యాయవాది ప్రస్తావించారు. ఒకే సామాజిక వర్గానికి చెందిన ఓటర్లను లక్ష్యంగా చేసుకున్నారనే ఆరోపణలపైనా విచారణ జరగాలని కోరారు. కలిలా బాద్‌లో భారీ సంఖ్యలో ఫారాలు సమర్పించే ప్రయత్నాన్ని అధికారులు అడ్డుకున్నారని ఈసీ గతంలో వెల్లడించింది. BLOలు సరైన పరిశీలన లేకుండా ఫారాలను స్వీకరించవద్దని ఆదేశించినట్లు తెలిపింది.

రెండు కోట్ల పేర్ల తొలగింపుపై ఆందోళన

ఉత్తరప్రదేశ్‌లో ఏప్రిల్‌లో ముగిసిన ఓటర్ల జాబితా సవరణ అనంతరం మొత్తం ఓటర్ల సంఖ్య 13.39 కోట్లకు చేరింది. గత జాబితాతో పోలిస్తే 84 లక్షల మంది పెరిగినా, సవరణ ప్రక్రియలో రెండు కోట్లకు పైగా పేర్లు తొలగించబడ్డాయి. తప్పుడు గుర్తింపు వివరాలు, నకిలీ సంతకాలు, ఇతరుల పేర్లతో అభ్యంతరాలు దాఖలు చేసినట్లు పిటిషన్‌లో ఆరోపించారు. కొందరు BLOల ఇళ్ల వద్ద కూడా ఫారం7లు లభించాయని, తమ పేర్లతో దరఖాస్తులు సమర్పించలేదని సంబంధిత వ్యక్తులు చెప్పినట్లు ఈసీ అఫిడవిట్‌లో పేర్కొంది. ఓటుహక్కు కోల్పోయే ప్రమాదం ఉన్నందున ఈ వ్యవహారాన్ని తక్షణమే పరిశీలించాలని కాంగ్రెస్ కోరుతోంది. డిసెంబరు లేదా జనవరి నుంచి రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల ప్రక్రియ ప్రారంభమయ్యే అవకాశం ఉండటంతో విచారణలో జాప్యం చేయవద్దని పిటిషనర్ తరపు న్యాయవాదులు విజ్ఞప్తి చేశారు.

ఐడీబీఐ విక్రయంపై రాహుల్ ఆగ్రహం!

- ప్రభుత్వ బ్యాంకులు అమ్మకానికి కాదు
- లాభాల్లోని బ్యాంకులను వదులుకుంటారా?
- ఉద్యోగులకు అండగా ఉంటానని వెల్లడి



ఐడీబీఐ బ్యాంకు ప్రైవేటీకరణ నిర్ణయంపై కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ కేంద్ర ప్రభుత్వాన్ని నిలదీశారు. లాభాలు ఆర్జిస్తున్న ప్రభుత్వ రంగ బ్యాంకును కెనడాకు చెందిన ఫెయిర్‌ఫాక్స్ సంస్థకు విక్రయించడంపై అభ్యంతరం వ్యక్తం చేశారు. గత ఏడాది మార్చిలో ఐడీబీఐ ఉద్యోగుల బృందం పార్లమెంటులో తనను కలిసి బ్యాంకు అమ్మకం ఎందుకని ప్రశ్నించిందని గుర్తుచేశారు. ఈ అంశాన్ని లోక్‌సభలో ప్రస్తావించి ఉద్యోగులు, ఖాతాదారుల ప్రయోజనాలకు రక్షణ కల్పించాలని కోరినా ప్రభుత్వం సరైన వివరణ ఇవ్వలేదని ఆరోపించారు. ఏడేళ్ల క్రితం నష్టాల్లో ఉన్న బ్యాంకు గత ఏడాది రూ.9 వేల కోట్లకు పైగా లాభాలు సాధించిందని, ఈ మార్పు వెనుక ఉద్యోగుల కృషి ఉందని ప్రశంసించారు. ప్రజాధనంతో నిర్మించిన బ్యాంకులు ప్రజల ఆస్తులని, వాటిని అమ్మే వస్తువులుగా కాకుండా దేశ నిర్మాణానికి ఉపయోగపడే సంస్థలుగా చూడాలని రాహుల్ పేర్కొన్నారు.

రిజర్వేషన్లు, ఉద్యోగ భద్రతపై ఆందోళన

ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వం, ఎల్ఐసీ కలిపి ఐడీబీఐలో 95 శాతం వాటా కలిగి ఉన్నాయని, విక్రయం తర్వాత వాటి వాటా 34 శాతానికి తగ్గుతుందని రాహుల్ తెలిపారు. 2003లో ఐడీబీఐలో కనీసం 50 శాతం వాటాను ప్రభుత్వం కొనసాగిస్తుందని పార్లమెంటుకు హామీ ఇచ్చిందని గుర్తుచేశారు. ఆ హామీని విస్మరించడం ప్రజలకు ఇచ్చిన మాటను తప్పడమేనని విమర్శించారు. బ్యాంకు ప్రైవేటు యాజమాన్యంలోకి వెళితే ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ రిజర్వేషన్లకు ముప్పు ఏర్పడుతుందని, ఇప్పటికే బలహీనపడిన ఉద్యోగుల సేవా నిబంధనలకు రక్షణ తగ్గుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లకు పూర్తిగా మద్దతు ఇస్తానని ప్రకటించారు. కాంగ్రెస్ హయాంలో పరిశ్రమల అభివృద్ధి కోసం బ్యాంకులు స్థాపించామని, ప్రస్తుత ప్రభుత్వ హయాంలో వాటిని విక్రయిస్తున్నారని వ్యాఖ్యానించారు.

రూ.53 వేల కోట్లకు విక్రయ ఒప్పందం

ఐడీబీఐలో 60.72 శాతం వాటాను సుమారు రూ.53 వేల కోట్లకు కెనడాకు చెందిన ఫెయిర్‌ఫాక్స్ ఫైనాన్షియల్ హోల్డింగ్స్‌కు విక్రయించేందుకు కేంద్రం అక్టోబర్ 14న ఆమోదం తెలిపింది. ఇందులో కేంద్ర ప్రభుత్వానికి చెందిన 30.48 శాతం వాటా విలువ రూ.26,620 కోట్లు, ఎల్ఐసీకి చెందిన 30.24 శాతం వాటా విలువ రూ.26,440 కోట్లు. ఒక్కో షేరుకు రూ.81 ధర నిర్ణయించగా, స్వతంత్ర సంస్థలు అంచనా వేసిన సరసమైన విలువ రూ.75.99గా ఉంది. రెండో విడత బిడ్డింగ్ ప్రక్రియ నిబంధనల ప్రకారమే జరిగిందని పెట్టుబడులు, ప్రభుత్వ ఆస్తుల నిర్వహణ విభాగం స్పష్టం చేసింది. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా అనుమతులు లభిస్తే ప్రస్తుత ఆర్థిక సంవత్సరం చివరి నాటికి విక్రయం పూర్తయ్యే అవకాశం ఉంది. బ్యాంకు విలువ, ఉద్యోగుల భవిష్యత్తు, ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణపై ఈ విక్రయం కొత్త చర్చకు తెరతీసింది.

రాహుల్ హిందుత్వ వ్యాఖ్యలే అస్త్రం

- పాత ప్రసంగాలతో బీజేపీ కొత్త యుద్ధం
- ఈసీ నియామకంపైనా ఎదురుదాడి
- నాటి వ్యాఖ్యల వీడియో విడుదల



కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీని లక్ష్యంగా చేసుకుని బీజేపీ మరోసారి విమర్శల దాడి ప్రారంభించింది. హిందుత్వం, హిందూ మతం, హిందూ దేవతలపై గతంలో ఆయన చేసిన వ్యాఖ్యల వీడియోలను సామాజిక మాధ్యమాల్లో విడుదల చేసింది. ఎన్నికలు సమీపించినప్పుడల్లా హిందువుగా కనిపించేందుకు రాహుల్ ప్రయత్నిస్తున్నారని ఆరోపించింది. ఇటీవల సుల్తాన్‌పూర్‌లోని ఎంపీ, ఎమ్మెల్యే కోర్టు 2018లో అమిత్ షాపై చేసిన వ్యాఖ్యలకు సంబంధించిన పరువునష్టం కేసులో ఆయనను నిర్దోషిగా ప్రకటించింది. ఈ నేపథ్యంలో శివుడికి సంబంధించిన త్రిపుండ్ర తిలకంతో రాహుల్ గాంధీ ఫొటోను పంచుకుంటూ 'సత్యం శివం సుందరం' అని పేర్కొనడాన్ని బీజేపీ ప్రస్తావించింది. దీనికి గతంలో హిందుత్వవాదులపై, హిందూ మతంపై ఆయన చేసిన ప్రసంగాల వీడియోలను జతచేసి విమర్శలు గుప్పించింది. దేవాలయాలకు వెళ్లే కొందరు వ్యక్తులే ఇతరులను వేధిస్తున్నారని, హిందుత్వవాదులను ఓడించాలని రాహుల్ గతంలో చేసిన వ్యాఖ్యలను కూడా ప్రదర్శించింది.

ఎన్నికల కమిషన్ నియామకంపై ప్రశ్నలు


మరోవైపు ప్రధాన ఎన్నికల కమిషనర్ నియామక విధానంపై కాంగ్రెస్ చేస్తున్న విమర్శలను బీజేపీ తిప్పికొట్టింది. కాంగ్రెస్ పాలనలో ఎన్నికల కమిషనర్ల నియామకానికి ప్రత్యేక చట్టం, ఎంపిక కమిటీ రెండూ లేవని ఆరోపించింది. అప్పట్లో ప్రధానమంత్రి, మంత్రివర్గమే పేర్లను నిర్ణయించేవారని, ప్రతిపక్ష నేతకు సంప్రదింపుల్లో భాగస్వామ్యం ఉండేది కాదని పేర్కొంది. ప్రస్తుతం పారదర్శకమైన వ్యవస్థ అమల్లో ఉన్నప్పటికీ కాంగ్రెస్ విమర్శలు చేయడం ఏమిటని ప్రశ్నించింది. ప్రజాస్వామ్యంపై నిజమైన ఆందోళనా? లేక అధికారం కోల్పోయిన అసహనమా? అని రాహుల్ గాంధీని నిలదీసింది. ఈ మేరకు సామాజిక మాధ్యమాల్లో పోస్టులు పెట్టింది.

సర్ వివాదం నేపథ్యంలో రాజకీయ వేడి

ఓటర్ల జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ (సర్) ప్రక్రియలో అక్రమాలు జరుగుతున్నాయని, ఓటర్ల పేర్లు తొలగిస్తున్నారని కాంగ్రెస్‌తో పాటు ఇతర విపక్షాలు ఆరోపిస్తున్నాయి. ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తున్నాయి. ఈ నేపథ్యంలో బీజేపీ తాజా విమర్శలు రాజకీయంగా ప్రాధాన్యం సంతరించుకున్నాయి. ఒకవైపు రాహుల్ గాంధీ మతపరమైన వ్యాఖ్యలను ప్రస్తావిస్తూ కాంగ్రెస్‌ను ఇరకాటంలో పెట్టే ప్రయత్నం, మరోవైపు ఎన్నికల కమిషన్ నియామక చరిత్రను ముందుకు తెస్తూ విపక్షాల విమర్శలకు సమాధానం చెప్పే వ్యూహంతో బీజేపీ ఎదురుదాడి చేస్తోంది. ఎన్నికల సంఘం విశ్వసనీయత, నియామక విధానం చుట్టూ సాగుతున్న రాజకీయ పోరు మరింత వేడెక్కుతోంది.

నావిక్‌కు ఇస్రో కొత్త బలం

కక్ష్యలోకి ఎన్‌వీఎస్-03 ఉపగ్రహం
స్వదేశీ దిక్సూచి సేవల సామర్థ్యం
శ్రీహరికోట నుంచి విజయవంతం



భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ ఇస్రో మరో కీలక ప్రయోగాన్ని చేపట్టింది. దేశీయ నావిగేషన్ వ్యవస్థ నావిక్ సామర్థ్యాన్ని పెంచే లక్ష్యంతో రూపొందించిన మూడో తరం ఉపగ్రహ శ్రేణిలోని ఎన్ వీఎస్ 03ను జీఎస్ ఎల్ వీ ఎఫ్18 రాకెట్ ద్వారా నింగిలోకి పంపింది. ఆంధ్రప్రదేశ్ లోని శ్రీహరి కోట సతీశ్ ధావన్ అంతరిక్ష కేంద్రం నుంచి రాత్రి 11.51 గంటలకు ఈ ప్రయోగం జరిగింది. 50 మీటర్ల ఎత్తున్న మూడు దశల రాకెట్ 2,232 కిలోల బరువున్న ఉపగ్రహాన్ని మోసుకెళ్లింది. జియోసింక్రోనస్ బదిలీ కక్ష్యలో ఉపగ్రహాన్ని ప్రవేశపెట్టడం ఈ ప్రయోగం లక్ష్యం. అనంతరం కక్ష్యను క్రమంగా పెంచే ప్రక్రియ ద్వారా భూమికి సుమారు 32.5 డిగ్రీల తూర్పు దిశలోని తుది స్థానానికి చేర్చనున్నారు. ఈ ప్రయోగంతో జీఎస్ ఎల్ వీ రాకెట్ కార్యక్రమంలో 20వ ప్రయోగం పూర్తయింది. ప్రయోగం విజయవంతంగా సాగినట్లు ఇస్రో ఎక్స్ వేదికగా ప్రకటించింది.

స్వదేశీ నావిక్ వ్యవస్థకు అదనపు బలం

ఎన్‌వీఎస్03 ఉపగ్రహం ద్వారా దేశీయ నావిగేషన్ సేవలు మరింత బలోపేతం కానున్నాయి. ప్రస్తుతం ఉన్న నావిక్ వ్యవస్థకు అదనపు సామర్థ్యం కల్పించడంతో పాటు కచ్చితమైన స్థానం, దిశ, సమయ సమాచారాన్ని అందించడంలో ఇది కీలక పాత్ర పోషిస్తుంది. ఉపగ్రహంలో భారత్‌లో తయారైన అణు గడియారంతోపాటు ఇతర అణు గడియారాలను అమర్చారు. వీటి ద్వారా సమయ నిర్ధారణ మరింత కచ్చితంగా జరుగుతుంది. ఇప్పటికే అందుబాటులో ఉన్న ఎల్5, ఎస్ బ్యాండ్ సంకేతాలకు అదనంగా కొత్తగా ఎల్1 సంకేతాన్ని కూడా ప్రసారం చేయనుంది. దీంతో భారత్‌తోపాటు దేశ సరిహద్దుల నుంచి సుమారు 1,500 కిలోమీటర్ల పరిధి వరకు నావిగేషన్ సేవలు అందుబాటులోకి వస్తాయి. రవాణా, పౌర అవసరాలతోపాటు రక్షణ రంగానికి కూడా ఈ వ్యవస్థ ఎంతో కీలకం.

రక్షణ అవసరాలకు స్వదేశీ సాంకేతికత

విదేశీ జీపీఎస్ వ్యవస్థలపై ఆధారపడకుండా సొంత నావిగేషన్ సేవలను అభివృద్ధి చేసుకోవడం వ్యూహాత్మకంగా భారత్‌కు ఎంతో అవసరం. ముఖ్యంగా సైనిక కార్యకలాపాలు, సరిహద్దు భద్రత వంటి కీలక అవసరాలకు నావిక్ స్వదేశీ సంకేతాలు ఉపయోగపడతాయి. ఆపరేషన్ సిందూర్ వంటి రక్షణ చర్యల్లోనూ స్వతంత్ర నావిగేషన్ సామర్థ్యం ప్రాధాన్యం సంతరించుకుంది. గతంలో వరుస వైఫల్యాలతో 'నాటీ బాయ్'గా పేరుపొందిన జీఎస్ ఎల్‌వీ రాకెట్ విజయవంతమైన ప్రయోగాలతో ఇప్పుడు 'స్మార్ట్ బాయ్'గా గుర్తింపు పొందుతోంది. తాజా ప్రయోగం దేశ అంతరిక్ష సాంకేతికతలో మరో ముందడుగుగా నిలిచింది. కచ్చితమైన స్థానం, సమయ సమాచారం అందించే స్వదేశీ వ్యవస్థను విస్తరించడంలో ఎన్‌వీఎస్03 కీలక మైలురాయిగా నిలవనుంది.

పేదరికంపై భారత్ విజయం

ప్రపంచ బ్యాంకు ప్రశంసలు!



దేశంలో గత దశాబ్ద కాలంలో పేదరికం గణనీయంగా తగ్గిందని ప్రపంచ బ్యాంకు తాజా నివేదిక వెల్లడించింది. ప్రపంచంలోనే అత్యంత వేగంగా పేదరికాన్ని తగ్గించిన దేశాల్లో భారత్ ఒకటిగా నిలిచిందని ప్రశంసించింది. పేదరికం, సమానత్వ నివేదిక ప్రకారం 2011లో రోజుకు 3 డాలర్ల కంటే తక్కువ ఆదాయంతో జీవిస్తున్న వారి సంఖ్య జనాభాలో 27.1 శాతం ఉండగా, 2023 నాటికి 2.6 శాతానికి పడిపోయింది. దిగువ మధ్య ఆదాయ దేశాల దారిద్ర్య ప్రమాణమైన రోజుకు 4.20 డాలర్ల ఆదాయ పరిమితి ప్రకారం పేదరికం 57.7 శాతం నుంచి 16.1 శాతానికి తగ్గింది. ఈ మార్పుతో సుమారు 49.6 కోట్ల మంది పేదరికం నుంచి బయటపడ్డారు.

మహిళా ఉపాధి.. గ్రామీణ ప్రాంతాల్లో మార్పు

2017 నుంచి 2023 మధ్య దేశంలో సుమారు 13.4 కోట్ల ఉద్యోగాలు పెరిగాయని ప్రపంచ బ్యాంకు తెలిపింది. ముఖ్యంగా గ్రామీణ మహిళలు వేతనంతో కూడిన పనుల్లోకి రావడం వల్ల కుటుంబాల ఆదాయ వనరులు పెరిగాయని వెల్లడించింది. విద్యుత్ సౌకర్యం కూడా గణనీయంగా విస్తరించి 2022 నాటికి జనాభాలో 99 శాతం మందికి అందుబాటులోకి వచ్చిందని పేర్కొంది. బహుముఖ పేదరిక సూచీ ప్రకారం 200506లో 53.8 శాతంగా ఉన్న పేదరికం 201921 నాటికి 16.4 శాతానికి తగ్గింది. ఈ నివేదికపై కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ హర్షం వ్యక్తం చేశారు. ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో ప్రభుత్వ విధానాలు ఫలితాలిస్తున్నాయని పేర్కొన్నారు.

ఇంకా సవాలుగానే అసమానతలు

• పేదరికం తగ్గినా ఆదాయ వ్యత్యాసాలు కొనసాగుతున్నాయని ప్రపంచ బ్యాంకు స్పష్టం చేసింది. 2023లో అత్యధిక ఆదాయం పొందుతున్న పది శాతం కార్మికుల మధ్యస్థ ఆదాయం, అత్యల్ప ఆదాయం పొందుతున్న పది శాతం కార్మికుల ఆదాయం కంటే 13 రెట్లు ఎక్కువగా ఉంది. ఉత్తరప్రదేశ్ నుంచి పశ్చిమ బెంగాల్ వరకు ఉన్న రాష్ట్రాల సమూహంలోనే దేశంలోని పేదల్లో 57 శాతం మంది నివసిస్తున్నట్లు వెల్లడించింది. 2026లో 14.2 శాతంగా అంచనా వేసిన 4.20 డాలర్ల పేదరిక రేటు 2028 నాటికి 12.1 శాతానికి తగ్గవచ్చని అంచనా వేసింది. పేదరికం తగ్గడం సానుకూల పరిణామమే అయినా, నాణ్యమైన ఉద్యోగాలు, మెరుగైన వేతనాలు, ప్రాంతీయ సమానత్వం సాధించడమే భారత్ ముందున్న అసలైన సవాలు.

సామాన్యుడికి ధరల మంట

పెరుగుతున్న ధరలపై ఆందోళన
బాబు పాలనపై జగన్ విమర్శలు



ఆంధ్రప్రదేశ్ లో నిత్యావసర వస్తువుల ధరలు, వివిధ రకాల చార్జీలు పెరుగుతున్నాయంటూ వైఎస్సార్ సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ఆందోళన వ్యక్తం చేశారు. చంద్రబాబు ప్రభుత్వ పాలనలో ధరలు సామాన్యులకు భారంగా మారాయని విమర్శించారు. ఈ మేరకు ఎక్స్ వేదికగా స్పందించిన ఆయన, 2024లో తమ ప్రభుత్వ హయాంలో ఉన్న ధరలకు, ప్రస్తుతం ఉన్న ధరలకు మధ్య వ్యత్యాసాన్ని వివరించారు. ప్రజల రోజువారీ అవసరాలకు సంబంధించిన వస్తువుల ధరలు భారీగా పెరిగాయని ఆరోపించారు. ధరల పెరుగుదలతో కుటుంబాల నెలవారీ ఖర్చులు పెరిగి సామాన్యులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు.

బియ్యం నుంచి వంటనూనె వరకు పెరుగుదల

జగన్ వెల్లడించిన వివరాల ప్రకారం, తమ ప్రభుత్వ హయాంలో సోనామసూరి బియ్యం బస్తా ధర రూ.1,400 ఉండగా, ప్రస్తుతం రూ.2,375కు చేరిందని పేర్కొన్నారు. పామాయిల్ లీటరు ధర రూ.85 నుంచి రూ.165కు, సన్ ఫ్లవర్ నూనె ధర రూ.110 నుంచి రూ.189కు పెరిగిందని తెలిపారు. కిలో ఉల్లిపాయల ధర రూ.15 నుంచి రూ.80కు చేరిందని వివరించారు. వీటితోపాటు విద్యుత్ ఛార్జీలు, ఆర్టీసీ బస్సు ఛార్జీలు కూడా పెంచారని చంద్రబాబు ప్రభుత్వంపై విమర్శలు గుప్పించారు. అన్ని వైపులా ధరలు, ఛార్జీల భారం పెంచుతూ ప్రజలపై అదనపు ఆర్థిక ఒత్తిడి మోపుతున్నారని జగన్ తన ట్వీట్ లో ఆరోపించారు.

ప్రచారానికి తెర.. నిశ్శబ్ద వేళ ప్రారంభం



చీరాల మున్సిపల్ ఎన్నికల ప్రచారానికి శుక్రవారం సాయంత్రం 5 గంటలకు గడువు ముగిసింది. దీంతో పట్టణంలో ఎన్నికల నిశ్శబ్ద వేళ ప్రారంభమైంది. ఇకపై అభ్యర్థులు, రాజకీయ పార్టీల నాయకులు ఎలాంటి బహిరంగ సభలు, ర్యాలీలు, రోడ్ షోలు నిర్వహించరాదని మున్సిపల్ కమిషనర్, సహాయ ఎన్నికల అధికారి స్పష్టం చేశారు. మైకులు, లౌడ్‌స్పీకర్ల ద్వారా ప్రచారం చేయడం కూడా నిషేధమని తెలిపారు. ఓటర్లను ప్రలోభపెట్టేలా లేదా ప్రభావితం చేసేలా వ్యవహరించకూడదని హెచ్చరించారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళిని ఉల్లంఘిస్తే చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. పోలింగ్ ప్రశాంతంగా, పారదర్శకంగా జరిగేందుకు అభ్యర్థులు, రాజకీయ పార్టీలు నిబంధనలు పాటిస్తూ అధికారులకు సహకరించాలని కమిషనర్ విజ్ఞప్తి చేశారు.



సేవా కార్యక్రమాలతో ఆర్. శ్రీను జన్మదిన వేడుకలు

వేంపల్లి మేజర్ పంచాయతీ మాజీ సర్పంచ్, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు రాచినేని శ్రీనివాసులు (ఆర్.శ్రీను) జన్మదిన వేడుకలు అభిమానులు, పార్టీ శ్రేణుల సమక్షంలో ఘనంగా జరిగాయి. భారీ కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. వేడుకలను సేవా కార్యక్రమాలతో ప్రత్యేకంగా నిర్వహించారు. వేంపల్లిలోని భవిత అంగవైకల్య పాఠశాల విద్యార్థులకు అన్నదానం చేసి పుస్తకాలు, విద్యా సామగ్రి పంపిణీ చేశారు. అనంతరం పాత గండి రోడ్డులోని మదర్ థెరిసా వృద్ధాశ్రమంలో వృద్ధులకు భోజనం అందించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి రాచినేని వేణుతోపాటు పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. పేదలు, విద్యార్థులు, వృద్ధులకు అండగా నిలుస్తూ జన్మదినాన్ని సేవా దినంగా నిర్వహించిన అభిమానులను పలువురు అభినందించారు. ఆర్.శ్రీను ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు.

కార్మికులకు ముఖ హాజరు తప్పనిసరి



నవంబర్ 1 నుంచి ప్రొద్దుటూరు మున్సిపాలిటీలో పారిశుధ్య కార్మికులకు ముఖ హాజరు విధానం తప్పనిసరి చేస్తున్నట్లు కమిషనర్ తూతిక శ్రీనివాస విశ్వనాథ్ ప్రకటించారు. పారిశుధ్య సిబ్బందితోపాటు నగరదీపిక, సులభ్ కాంప్లెక్స్, అప్కాస్ సిబ్బంది కూడా ఈ విధానంలో హాజరు నమోదు చేసుకోవాలని ఆదేశించారు. భవిష్యత్తులో ముఖ హాజరు ఆధారంగానే జీతాలు చెల్లిస్తామని స్పష్టం చేశారు. ప్రభుత్వ వేతనాలు పొందుతున్న ప్రతి ఉద్యోగి విధిగా హాజరు నమోదు చేసుకోవాలని సూచించారు. సిబ్బందిలో సమయపాలన పెంచడం, పారిశుధ్య నిర్వహణను మెరుగుపరచడం, ప్రజలకు నాణ్యమైన సేవలు అందించడమే ఈ విధానం ప్రధాన ఉద్దేశమని కమిషనర్ తెలిపారు. ఇప్పటికే మున్సిపల్ ఆరోగ్య అధికారికి అవసరమైన ఆదేశాలు జారీ చేసినట్లు వెల్లడించారు.

గుంటూరు కార్పొరేషన్ ఎన్నికలకు భారీ ఏర్పాట్లు



నవంబర్ 1న జరగనున్న గుంటూరు నగరపాలక సంస్థ ఎన్నికలకు అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయని కమిషనర్ కె. మయూర్ అశోక్ తెలిపారు. పోలింగ్ నిర్వహణకు 3,576 మంది సిబ్బంది, భద్రతకు 1,500 మంది పోలీసులు విధుల్లో ఉంటారని వెల్లడించారు. అదనంగా నగరపాలక సంస్థకు చెందిన 2,000 మంది సిబ్బంది సేవలందిస్తారు. ఎన్నికల సమన్వయానికి 27 మంది రిటర్నింగ్ అధికారులు, 77 మంది సహాయ అధికారులు, 13 మంది జోనల్ అధికారులు, 61 మంది రూట్ అధికారులను నియమించారు. శుక్రవారం ఆంధ్ర ముస్లిం కళాశాలలో పోలింగ్ సామగ్రి పంపిణీ నమూనా ప్రక్రియను పరిశీలించారు. నవంబర్ 3న ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో 50 హాళ్లు, 468 బల్లలపై ఓట్ల లెక్కింపు చేపడతారు. ఇందుకోసం 2,160 మంది సిబ్బందిని నియమించారు. స్ట్రాంగ్ రూముల వద్ద మూడంచెల పోలీసు భద్రత కల్పించనున్నారు.

జమ్మలమడుగులో దాడుల ఆరోపణలు, ధర్నా



జమ్మలమడుగులో ఎన్నికల ప్రచారం చివరి రోజున రాజకీయ ఉద్రిక్తత నెలకొంది. బీసీ కాలనీలో ప్రచారం నిర్వహిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులపై కూటమి నేతలు దాడి చేసి వాహనాలను ధ్వంసం చేశారని ఆరోపిస్తూ ఆ పార్టీ నాయకులు గాంధీ బొమ్మ సర్కిల్‌లో ధర్నాకు దిగారు. ఎమ్మెల్సీ రామసుబ్బారెడ్డి సతీమణి ఇందిరమ్మ మాట్లాడుతూ ఓటమి భయంతోనే కూటమి నాయకులు దౌర్జన్యాలకు పాల్పడుతున్నారని విమర్శించారు. వైఎస్సార్‌సీపీ ఒక్క కౌన్సిలర్ స్థానాన్ని కూడా గెలవదన్న ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి సవాల్‌కు కట్టుబడి ఉండాలని ప్రతిసవాల్ విసిరారు. భూపేష్‌రెడ్డి తన బాబాయి అడుగుజాడల్లో నడుస్తున్నారని విమర్శించారు. పోలీసులు కూటమికి అనుకూలంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. ప్రాణాలకు ముప్పు వచ్చినా వెనక్కి తగ్గేది లేదని, పార్టీ విజయం సాధించే వరకు పోరాటం కొనసాగిస్తామని ఇందిరమ్మ స్పష్టం చేశారు.

చీరాలలో ఆమంచి ప్రచార జోరు..!



చీరాల మున్సిపల్ ఎన్నికల వేళ రాజకీయ సందడి పెరిగింది. అక్టోబర్ 30న మాజీ ఎమ్మెల్యే ఆమంచి కృష్ణ మోహన్, కాంగ్రెస్ మున్సిపల్ చైర్మన్ అభ్యర్థి డాక్టర్ మెడిద దివ్య సుధాకర్‌తో కలిసి పట్టణంలోని 8, 37, 40, 41వ వార్డుల్లో విస్తృతంగా పర్యటించారు. స్థానిక నాయకులు, కార్యకర్తలు, అభిమానులు ఈ ప్రచారంలో పాల్గొని అభ్యర్థులకు మద్దతుగా నినాదాలు చేశారు. నవంబర్ 1న జరగనున్న మున్సిపల్ ఎన్నికల్లో పింక్ బ్యాలెట్ పత్రంపై నాలుగో నంబరులో ఉన్న హస్తం గుర్తుకు ఓటు వేయాలని ఆమంచి ప్రజలను కోరారు. చీరాలలో ప్రజా సమస్యలు పరిష్కారం కావడం లేదని, ప్రస్తుత పాలనపై ప్రజల్లో అసంతృప్తి ఉందని ఆయన విమర్శించారు. మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో పట్టణంలో కాంగ్రెస్ ప్రచారం ఊపందుకుంది.

ప్రజాబలం ఉంటే పోటీకి వెనుకడుగు ఎందుకు?



ప్రొద్దుటూరులో టీడీపీ సాధించిన ఏకగ్రీవాలపై మాజీ ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్ రెడ్డి తీవ్ర విమర్శలు చేశారు. ప్రజాబలంపై నమ్మకం ఉంటే ప్రతిపక్షాలకు పోటీ అవకాశం ఇచ్చి గెలవాలని, నామినేషన్లను అడ్డుకుని ఏకగ్రీవాలు సాధించడం ఎందుకని ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డిని ప్రశ్నించారు. అధికార యంత్రాంగం, పోలీసుల సహకారంతో టీడీపీ ఏకగ్రీవాలు సాధించిందని ఆరోపించారు. దీనివల్ల నియోజకవర్గంలోని 2.47 లక్షల మంది ఓటర్లు ఓటు హక్కు వినియోగించుకునే అవకాశం కోల్పోయారని పేర్కొన్నారు. 2021 ఎన్నికల్లో తొమ్మిది వార్డులే ఏకగ్రీవమయ్యాయని గుర్తుచేశారు. తనకు వైసీపీ నేత పోరెడ్డి నరసింహారెడ్డికి విభేదాలు సృష్టించవద్దని, తామంతా ఐక్యంగా ఉన్నామని స్పష్టం చేశారు. కులాల ప్రస్తావనతో రాజకీయాలు చేయడం మానుకోవాలని హితవు పలికారు. 2029లో జగన్ హీరోగా నిలుస్తారని ధీమా వ్యక్తం చేస్తూ, ప్రజలే అంతిమ నిర్ణేతలని, తాను అధికారంలో ఉన్నా లేకున్నా ప్రజల తరపున పోరాడతానని ప్రకటించారు.

అవినీతి నిర్మూలనకు బ్యాంక్ ఆఫ్ ఇండియా చైతన్యం



విజయవాడలో విజిలెన్స్ అవేర్‌నెస్ వీక్-2026లో భాగంగా సీబీఐ, ఏసీబీ సంయుక్తంగా వాక్‌థాన్, అవగాహన కార్యక్రమాలు నిర్వహించాయి. బ్యాంక్ ఆఫ్ ఇండియా విజయవాడ జోనల్ మేనేజర్ వి. బంగార్ రాజు, డిప్యూటీ జోనల్ మేనేజర్ నబదీప్ మహంతి సహా బ్యాంకు సిబ్బంది పాల్గొన్నారు. అదనపు పోలీసు ఎస్పీ చిత్త రంజన్ దాస్, సీనియర్ డివిజనల్ సెక్యూరిటీ కమిషనర్ ఎస్. షణ్ముగ వడివేలు హాజరయ్యారు. ప్రభుత్వ, ప్రభుత్వ రంగ సంస్థలకు చెందిన 300 మందికి పైగా ప్రతినిధులు వాక్‌థాన్‌లో పాల్గొని అవినీతి వ్యతిరేక సందేశాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లారు. అనంతరం జరిగిన సదస్సులో నివారణాత్మక విజిలెన్స్, సమాచారదారుల రక్షణ, విజిలెన్స్ అవేర్‌నెస్ వీక్ పోస్టర్ విధానాలపై వివరించారు. అక్రమాలను గుర్తించి అధికారులకు ఫిర్యాదు చేయడం, ఫిర్యాదుదారుల భద్రతపై అవగాహన కల్పించారు. అన్ని రంగాల్లో పారదర్శకత, జవాబుదారీతనం పెంపొందించేందుకు ప్రజలు బాధ్యతగా వ్యవహరించాలని నిర్వాహకులు పిలుపునిచ్చారు.

శివమ్మకు మద్దతుగా సతీష్ రెడ్డి ప్రచారం



వేంపల్లి మండలంలో జడ్పీటీసీ ఎన్నికల ప్రచారం ఊపందుకుంది. వైఎస్సార్‌సీపీ అభ్యర్థి బత్తల వెంకట శివమ్మకు మద్దతుగా పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సతీష్ రెడ్డి పట్టణంలోని పలు వార్డుల్లో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. తన సోదరుడు విష్ణువర్ధన్ రెడ్డి, మాజీ జడ్పీటీసీలు రవికుమార్ రెడ్డి, రాష్ట్ర పౌర సరఫరాల సంస్థ డైరెక్టర్ షబ్బీర్ వలి, మండల కన్వీనర్ చంద్రఓబుల్ రెడ్డితో కలిసి ఆయన ప్రచారంలో పాల్గొన్నారు. అభ్యర్థి శివమ్మతో కలిసి ఇళ్లకు వెళ్లి స్థానికులను కలుసుకున్నారు. వారి సమస్యలు, అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు. గతంలో మండలంలో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలను వివరిస్తూ, గ్రామీణ ప్రాంతాల అభివృద్ధి, ప్రజా సమస్యల పరిష్కారమే తమ లక్ష్యమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

చీరాలలో వైఎస్సార్‌సీపీ ప్రచార జోరు



చీరాల మున్సిపల్ ఎన్నికల ప్రచారం చివరి రోజున వైఎస్సార్ సీపీ నేతలు విస్తృతంగా పర్యటించి ఓటర్ల మద్దతు కోరారు. పార్టీ నియోజకవర్గ ఇన్ చార్జ్ కరణం వెంకటేష్ బాబు, మున్సిపల్ చైర్మన్ అభ్యర్థి డాక్టర్ ఇస్తర్ల షెర్లీ శుక్రవారం 2, 9, 12, 41, 42, 43, 44వ వార్డుల్లో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. పులి అఖిల, తిరువీధుల లక్ష్మి, నల్లమల్లి వెంకట సుబ్బారావు, కొండ్రు రవీంద్ర, బిక్కి రాజు, తొట్టెంపూడి మేరీమ్మ, మేరుగు శ్రీకాంత్ ల విజయానికి మద్దతు కోరారు. గత ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరిస్తూ ఫ్యాన్ గుర్తుపై ఓటు వేయాలని విజ్ఞప్తి చేశారు. చీరాల అభివృద్ధి, ప్రజా సంక్షేమమే తమ లక్ష్యమని కరణం వెంకటేష్ తెలిపారు. చైర్మన్ అభ్యర్థితోపాటు కౌన్సిలర్ అభ్యర్థులను భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు.

బొత్స కుటుంబ పందెం!

విజయనగరం జడ్పీ పోరు.. సత్తిబాబు వర్సెస్ చిన్న శ్రీను




విజయనగరం జిల్లా పరిషత్ ఎన్నికలు వైఎస్సార్ సీపీలో కొత్త రాజకీయ సమీకరణాలకు తెరతీశాయి. పార్టీ అంతర్గత పరిణామాల నేపథ్యంలో సీనియర్ నేత బొత్స సత్యనారాయణ తన రాజకీయ బలాన్ని మరోసారి నిరూపించుకునేందుకు రంగంలోకి దిగారు. చిన్న శ్రీను పార్టీ నుంచి దూరమైన నేపథ్యంలో జిల్లాలో వైఎస్సార్ సీపీ బాధ్యతలను బొత్స భుజాన వేసుకున్నారు. ఈ క్రమంలో ఏకంగా నాలుగు జడ్పీటీసీ స్థానాల్లో తన కుటుంబ సభ్యులతో నామినేషన్లు వేయించడం చర్చనీయాంశమైంది. బొండపల్లి నుంచి కుమార్తె అనూష, గరివిడి నుంచి కోడలు పూజిత, గుర్ల నుంచి చెల్లెలు లక్ష్మి, పూసపాటిరేగ నుంచి తమ్ముడి కుమారుడు చైతన్య బరిలోకి దిగిన నామినేషన్ల పరిశీలనలో ఎన్నికల రిటర్నింగ్ అధికారి తిరస్కరించారు. గరివిడి, గుర్ల, పూసపాటిరేగ స్థానాలు బొత్స ప్రాతినిధ్యం వహించిన చీపురుపల్లి నియోజకవర్గ పరిధిలో ఉన్నాయి. బొండపల్లి మాత్రం ఆయన సోదరుడు అప్పలనరసయ్య రాజకీయ ప్రస్థానంతో ముడిపడి ఉన్నప్రాంతం. అభ్యర్థులు దొరకడం కష్టమవుతుందని భావించిన తరుణంలో బొత్స కుటుంబం నేరుగా పోటీలోకి దిగడం పార్టీ శ్రేణుల్లో ఆసక్తి రేపుతోంది.

రాజకీయ ప్రతిష్ఠకు పరీక్షగా జడ్పీ ఎన్నికలు

బొత్సకు జిల్లా పరిషత్ ఎన్నికలు ఎప్పటి నుంచో ప్రతిష్ఠాత్మకంగా ఉన్నాయి. చిన్న శ్రీనుతో విభేదాలు, పార్టీ అంతర్గత పరిణామాల నేపథ్యంలో ఈ ఎన్నికలు ఆయనకు మరింత కీలకంగా మారాయి. పార్టీ బలహీనపడకుండా నిలబెట్టాల్సిన బాధ్యతను స్వీకరించిన బొత్స, తన కుటుంబ సభ్యులను నాలుగు స్థానాల్లో నిలబెట్టడం ద్వారా పెద్ద రాజకీయ సవాలును ఎంచుకున్నారు. ఈ పోటీ ఫలితాలు ఆయన వ్యక్తిగత రాజకీయ ప్రతిష్ఠతో పాటు కుటుంబ భవిష్యత్తుపైనా ప్రభావం చూపే అవకాశం ఉంది. సతీమణి ఝాన్సీలక్ష్మి, కుమారుడు సందీప్, కుమార్తె అనూష, సోదరుడు అప్పలనరసయ్య, ఇతర కుటుంబ సభ్యుల రాజకీయ ప్రాధాన్యంపైనా ఈ పరిణామాలు చర్చకు దారితీశాయి. మరోవైపు, ఈ ఎన్నికలను 2029 అసెంబ్లీ ఎన్నికలకు ముందస్తు రాజకీయ బలపరీక్షగా బొత్స చూస్తున్నారనే విశ్లేషణలు వినిపిస్తున్నాయి.

బొత్స వ్యూహానికి ప్రతిగా చిన్న శ్రీను కూడా తన కుమార్తె సిరి సహస్రతో రెండు జడ్పీటీసీ స్థానాల్లో నామినేషన్లు వేయించారు. కొత్తపలస, తెర్లాం స్థానాల నుంచి ఆమె పోటీకి సిద్ధమయ్యారు. ఒకే అభ్యర్థి రెండు స్థానాల్లో బరిలోకి దిగడం ద్వారా జిల్లా రాజకీయాల్లో చిన్న శ్రీను తన వ్యూహాన్ని స్పష్టంచేశారు. తన కుమార్తెను జడ్పీ పీఠంపై కూర్చోబెట్టాలన్న లక్ష్యంతో ఆయన అడుగులు వేస్తున్నారనే చర్చ సాగుతోంది.



ధరల పెరుగుదలపై వైఎస్ జగన్ ఎక్స్ పోస్ట్



దోచుకుతిందాం రండి..!



బియ్యం ధరల గుట్టు.. సర్కారు కనికట్టు

- చోద్యం చూస్తున్న పాలకులు
- ప్రభుత్వ నిబంధనలకు పాతర
- రెచ్చిపోతున్న అక్రమార్కులు
- కలెక్షన్లతో మిలర్ల జాతర

ఉల్లి ధరలే పాలకులను గద్దె దించిన చరిత్ర మన దేశంలో ఉంది. అలాంటిది ఇప్పుడు బియ్యం ధరలు అంతకుమించిన భారంగా మారుతున్నాయన్న ఆందోళన వ్యక్తమవుతోంది. సామాన్యుడి కంచంలో ప్రధాన ఆహారమైన బియ్యం.. కోట్లాది కుటుంబాల జీవనాధారం. అలాంటి బియ్యమే ఇప్పుడు బడ్జెట్‌ను కుదేలు చేస్తోంది. ముఖ్యంగా ఆంధ్రప్రదేశ్, తెలంగాణలో సన్నబియ్యం ధరలు చుక్కలంటుతున్నాయి. కిలో రూ.85 నుంచి రూ.95 పలుకుతుండగా, కొన్ని రకాలు రూ.100కు చేరువయ్యాయి. 25 కిలోల బస్తా ధర రూ.1,500–1,800 నుంచి కొన్ని బ్రాండ్లలో రూ.2,150–2,500కు పెరిగింది. అయితే 2026 అక్టోబర్ 30న కేంద్ర ధరల పర్యవేక్షణ వ్యవస్థ వెల్లడించిన వివరాల ప్రకారం దేశవ్యాప్తంగా బియ్యం సగటు రిటైల్ ధర కిలో రూ.48.23గా ఉంది. సెప్టెంబర్ 17న నమోదైన రూ.46.50తో పోలిస్తే పెరుగుదల కేవలం రూ.1.73. అంటే 25 కిలోల బస్తాపై సగటున సుమారు రూ.43 అదనపు భారం. కానీ జాతీయ సగటు ధరకు, తెలుగు రాష్ట్రాల్లో వినియోగదారుడు చెల్లిస్తున్న ధరకు భారీ వ్యత్యాసం కనిపిస్తోంది. సాధారణ బియ్యం, సన్నబియ్యం, సూపర్‌ఫైన్, బాస్మతి రకాల మధ్య ధరల్లో తేడాలున్నప్పటికీ, స్థానిక మార్కెట్లలో సన్నబియ్యం ధరలు దాదాపు రెట్టింపు స్థాయికి చేరడం ఆందోళన కలిగిస్తోంది. జాతీయ సగటుకు, స్థానిక మార్కెట్ ధరలకు ఇంత తేడా ఎందుకు? ఈ ధరల పెరుగుదల వెనుక అసలు కారణాలేంటి? మార్కెట్‌లో జరుగుతున్న పరిణామాలను గుర్తించి నియంత్రించాల్సిన ప్రభుత్వ యంత్రాంగం ఏం చేస్తోంది? దేశవ్యాప్తంగా సగటు ధర ఒకలా ఉంటే.. సామాన్యుడి కంచంలో అన్నం మరోలా ఖరీదవుతోంది. ఈ వ్యత్యాసానికి సమాధానం చెప్పాల్సిన బాధ్యత ప్రభుత్వాలదే!

• గోదాముల్లో నిల్వలు.. మార్కెట్లో ధరల మాయాజాలం?

బియ్యం ధరలు పెరుగుతున్నాయంటే దేశంలో ఉత్పత్తి తగ్గిపోయిందా? గోదాములు ఖాళీ అయ్యాయా? లేక అందుబాటులో ఉన్న సరుకును కొందరు వ్యాపారులు నియంత్రిస్తున్నారా? ఈ ప్రశ్నలకు కేంద్ర ప్రభుత్వ నిల్వల గణాంకాలు కీలక ఆధారంగా నిలుస్తున్నాయి. 2026 సెప్టెంబర్ 1 నాటికి కేంద్ర పూల్‌లో 390.53 లక్షల టన్నుల బియ్యం, 479.92 లక్షల టన్నుల గోధుమలు.. మొత్తం 870.45 లక్షల టన్నుల ఆహార ధాన్యాలు నిల్వ ఉన్నాయి. వీటికి అదనంగా ప్రభుత్వ సంస్థల వద్ద మిల్లింగ్ కోసం 307.51 లక్షల టన్నుల ధాన్యం అందుబాటులో ఉంది. ఇంత భారీ నిల్వలున్నా మార్కెట్లో ధరలు ఎందుకు తగ్గడం లేదు? అయితే ఈ నిల్వలన్నీ వెంటనే రిటైల్ మార్కెట్‌కు విడుదల చేసేవి కావు. ప్రజాపంపిణీ వ్యవస్థ, ప్రభుత్వ పథకాలు, బఫర్ నిల్వలు వంటి అవసరాలకూ వాటిని కేటాయించాలి. అయినప్పటికీ ధరల నియంత్రణకు అవసరమైన నిల్వలను ప్రభుత్వం ఎప్పుడు, ఎంత మేరకు మార్కెట్లోకి విడుదల చేస్తుందన్నది కీలకం. మరోవైపు అక్రమ నిల్వలపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. సరుకు అందుబాటులో ఉన్నా సరఫరాను తగ్గిస్తున్నారా? ధరలు పెరిగే వరకు నిల్వలు ఉంచుతున్నారా? ఈ అనుమానాలపై గోదాముల తనిఖీలు, నిల్వల రిజిస్టర్లు, కొనుగోలు బిల్లులు, అమ్మకాలు, రవాణా లెక్కలను పరిశీలించాలి. అక్రమాలు నిర్ధారణైతే చర్యలు తీసుకోవాలి. ఆధారాలు లేకుండా వ్యాపారులందరినీ మాఫియాగా చిత్రీకరించడం కూడా సరికాదు. నిల్వలు, కొనుగోళ్లు, మార్కెట్ సరఫరా వివరాలను ప్రభుత్వం పారదర్శకంగా వెల్లడించాలి. మరో కీలక అంశం విదేశీ ఎగుమతులు. గతంలో విధించిన అనేక ఆంక్షలను కేంద్రం సడలించి, 2026 నాటికి కొన్ని మినహాయింపులతో బియ్యం ఎగుమతులకు అనుమతించింది. నాన్ బాస్మతి బియ్యం ఎగుమతులకు ఏపీఈడీఏ వద్ద ఒప్పందాల నమోదు వంటి నిబంధనలు కూడా అమల్లో ఉన్నాయి. ఈ ఎగుమతులు దేశీయ సరఫరా, ధరలపై ఎంత ప్రభావం చూపుతున్నాయో పరిశీలించాలి. అయితే ఎగుమతులే ధరల పెరుగుదలకు కారణమని నిర్ధారించాలంటే ఎగుమతి పరిమాణాలు, దేశీయ సరఫరా, నిల్వల వినియోగంపై ఆధారాలు అవసరం. గోదాముల్లో లక్షల టన్నుల నిల్వలు.. మార్కెట్లో మాత్రం ధరల మంట! ఈ వైరుధ్యానికి కారణం సరుకు కొరతా? అక్రమ నిల్వలా? ఎగుమతుల ప్రభావమా? ప్రభుత్వం ప్రకటనలతో కాకుండా పక్కా గణాంకాలతో సమాధానం చెప్పాలి.

• ఎల్‌నినో దెబ్బ... జనవరి తర్వాత అబ్బా అనాల్సిందేనా?

ఇప్పటికే బియ్యం ధరలతో ఉక్కిరిబిక్కిరవుతున్న ప్రజలకు ఎల్‌నినో రూపంలో మరో ముప్పు పొంచి ఉంది. వాతావరణ మార్పులు వ్యవసాయ దిగుబడులను, తద్వారా ఆహార ధరలను ప్రభావితం చేస్తాయి. ముఖ్యంగా వరి సాగుకు నీరు కీలకం. వర్షాలు తగ్గినా, రిజర్వాయర్లలో నిల్వలు పడిపోయినా, భూగర్భ జలాలు అడుగంటినా పంట దిగుబడులపై ప్రభావం తప్పదు. కేంద్ర భూ విజ్ఞాన శాస్త్రాల శాఖ మంత్రి 2026 ఆగస్టు 5న లోక్‌సభకు ఇచ్చిన సమాధానంలో ఎల్‌నినో పరిస్థితులు అదే ఏడాది మేలో ప్రారంభమయ్యాయని, 2027 ఫిబ్రవరి వరకు కొనసాగవచ్చని వెల్లడించారు. ఐఎన్‌సీఓఐఎస్ అంచనాల ప్రకారం ఇది కొనసాగడానికి 70 నుంచి 90 శాతం అవకాశం ఉంది. అయితే ఎల్‌నినో ప్రభావం ఉందంటే కరువు తప్పదని, వరి దిగుబడులు భారీగా పడిపోతాయని భావించలేం. హిందూ మహాసముద్రంలో వచ్చే మార్పులు, ఇతర వాతావరణ పరిస్థితులు కూడా వర్షపాతాన్ని ప్రభావితం చేస్తాయి. ఇప్పటికే బియ్యం ధరలు భగ్గుమంటున్న నేపథ్యంలో జనవరి 2027 తర్వాత పరిస్థితి ఎలా ఉంటుందన్నది ఆందోళన కలిగిస్తోంది. ఖరీఫ్ దిగుబడులు, రబీ సాగు విస్తీర్ణం, నీటి లభ్యత, ప్రభుత్వ కొనుగోళ్లు, మిల్లింగ్ సామర్థ్యం రాబోయే నెలల్లో ధరల దిశను నిర్ణయించనున్నాయి. సరఫరా తగ్గితే ధరలపై మరింత ఒత్తిడి పెరిగే ప్రమాదం ఉంది. అయితే బియ్యం ధరలు రెట్టింపవుతాయని ఇప్పుడే అంచనా వేయడం సమంజసం కాదు. ఉత్పత్తి తగ్గడం, నిల్వలు పడిపోవడం, సరఫరా వ్యవస్థ దెబ్బతినడం వంటి పరిణామాలు చోటుచేసుకుంటేనే తీవ్ర సంక్షోభం తలెత్తుతుంది. అందుకే ప్రభుత్వం జిల్లాలవారీగా పంటల పరిస్థితి, రిజర్వాయర్ల నీటి నిల్వలు, భూగర్భ జలాలు, విత్తనాలు, ఎరువుల లభ్యతపై ముందస్తు అంచనాలు సిద్ధం చేయాలి. అవసరమైతే ప్రత్యామ్నాయ పంటలను ప్రోత్సహిస్తూ, వినియోగదారులకు కొరత రాకుండా బియ్యం నిల్వలను సిద్ధం చేయాలి. ధరలు పెరిగాక స్పందించడం కాదు.. ముందుగానే ప్రమాదాలను గుర్తించి నివారించడమే సమర్థ పాలన. ఎల్‌నినో కేవలం వాతావరణ హెచ్చరిక కాదు.. రైతు భవిష్యత్తుకు, బియ్యం ధరలకు, దేశ ఆహార భద్రతకు ఎదురవుతున్న కీలక పరీక్ష!

• వరి వద్దంటున్న సర్కార్.. మరి ప్రత్యామ్నాయం వరొంటవుతుందా?

ఒకవైపు బియ్యం ధరలు ఆకాశాన్నంటుతుంటే.. మరోవైపు వరి సాగు తగ్గించాలన్న ప్రభుత్వ సూచనలు రైతుల్లో ఆందోళన రేపుతున్నాయి. ముఖ్యంగా తెలంగాణలో నీటి వినియోగం, పంటల మార్పిడి, మార్కెట్ డిమాండ్‌ను దృష్టిలో పెట్టుకుని సాగు నిర్ణయాలు తీసుకోవాలని ప్రభుత్వం సూచిస్తోంది. వరికి అధికంగా నీరు అవసరమని, కొన్ని ప్రాంతాల్లో ప్రత్యామ్నాయ పంటలు లాభదాయకమని నిపుణులు చెబుతున్నారు. అయితే వరి సాగు తగ్గితే భవిష్యత్తులో బియ్యం సరఫరా పరిస్థితి ఏంటి? తెలంగాణ గత కొన్నేళ్లుగా వరి ఉత్పత్తిలో కీలక రాష్ట్రంగా ఎదిగింది. ప్రభుత్వ కొనుగోళ్లు, మద్దతు ధర, మిల్లింగ్ వ్యవస్థపై ఆధారపడి రైతులు పెద్దఎత్తున వరి సాగు చేస్తున్నారు. ఇప్పుడు సాగు తగ్గించాలంటే ప్రత్యామ్నాయంగా ఏ పంటలు వేయాలి? వాటికి గిట్టుబాటు ధర, కొనుగోలు హామీ ఉంటాయా? మార్కెట్ డిమాండ్ ఎంత? పెట్టుబడి, దిగుబడి, ఆదాయం ఎలా ఉంటాయి? ప్రభుత్వం వీటిపై స్పష్టత ఇవ్వాలి. కేవలం నీటి వినియోగం ఎక్కువనే కారణంతో వరి సాగును తగ్గించమంటే సరిపోదు. రైతు కుటుంబాల ఆదాయం, ప్రాంతీయ పరిస్థితులు, కొనుగోలు వ్యవస్థను కూడా పరిగణనలోకి తీసుకోవాలి. రైతులు వరికి దూరమైతే ఉత్పత్తి తగ్గుతుంది. అదే సమయంలో ఎల్‌నినో ప్రభావంతో ఇతర ప్రాంతాల్లోనూ దిగుబడులు పడిపోతే బియ్యం సరఫరాపై మరింత ఒత్తిడి ఏర్పడి, ఆ భారం వినియోగదారుడిపై పడే ప్రమాదం ఉంది. మరోవైపు వరి సాగును ప్రోత్సహించి, పంట చేతికొచ్చాక కొనుగోళ్లలో జాప్యం చేయడం కూడా రైతుకు అన్యాయమే. కొనుగోలు కేంద్రాల ఆలస్యం, తేమ శాతం పేరుతో తిరస్కరణలు, మిల్లులకు తరలింపులో ఇబ్బందులు, చెల్లింపుల జాప్యం రైతులను ఆర్థికంగా దెబ్బతీస్తున్నాయి. అందుకే సాగుకు ముందే ఏ పంటకు ఎంత నీరు, పెట్టుబడి అవసరం? ఎంత దిగుబడి వస్తుంది? మార్కెట్ ధర ఎంత? ప్రభుత్వ కొనుగోలు భరోసా ఉందా? అనే వివరాలు గ్రామస్థాయిలో అందించాలి. వరి సాగు తగ్గించాలంటే ప్రత్యామ్నాయ పంటలకు ముందుగా మార్కెట్ కల్పించాలి. లేదంటే రైతు సాగుకు దూరమై ఉత్పత్తి తగ్గుతుంది.. చివరకు బియ్యం ధరల భారం ప్రజలపై పడుతుంది. రైతుకు గిట్టుబాటు ధర దక్కకపోవడం, వినియోగదారుడు అధిక ధరకు బియ్యం కొనాల్సి రావడం మధ్య ఉన్న వ్యత్యాసాన్ని ప్రభుత్వం గుర్తించాలి. రైతుకు సాగుపై భరోసా లేకపోతే.. ప్రజలకు బియ్యం ధరపై భరోసా ఎలా? వరి సాగు తగ్గి క్రాప్ హాలిడే పరిస్థితి రాకముందే ప్రభుత్వాలు మేల్కొని సమగ్ర వ్యవసాయ ప్రణాళిక సిద్ధం చేయాలి!

• అక్రమార్కులు పేట్రేగిపెతుంటే పాలకులకు బాధ్యత లేదా?

బియ్యం ధరల పెరుగుదలకు ఒక్క కారణాన్ని చూపించి ప్రభుత్వాలు బాధ్యత నుంచి తప్పించుకోలేవు. రైతు పొలం నుంచి వినియోగదారుడి కంచం వరకు ప్రతి దశలో పర్యవేక్షణ అవసరం. రైతు వద్ద ఒక ధర, మిల్లులో మరో ధర, హోల్‌సేల్‌లో ఇంకో ధర, రిటైల్‌లో మరింత ఎక్కువ ధర ఎందుకు? మిల్లర్లు, వ్యాపారుల వద్ద నిల్వలెంత? మార్కెట్లోకి వస్తున్న సరుకెంత? ఏ ప్రాంతంలో ధరలు ఎక్కువగా ఉన్నాయి? ఈ వివరాలను జిల్లాలవారీగా ప్రజలకు వెల్లడించాలి. అక్రమ నిల్వలపై ఆకస్మిక తనిఖీలు నిర్వహించి, తప్పులు నిర్ధారణైతే చర్యలు తీసుకోవాలి. తనిఖీల ప్రకటనలతో సరిపెట్టకుండా స్వాధీనం చేసుకున్న సరుకు, నమోదైన కేసుల వివరాలనూ బయటపెట్టాలి. ఏపీలో సూపర్ సిక్స్ హామీలు, తెలంగాణలో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు ఎంత ముఖ్యమో నిత్యావసర ధరలను నియంత్రించడం కూడా అంతే ముఖ్యం. బియ్యం ధరలు పెరిగితే పేద కుటుంబాలు కొనుగోళ్లు తగ్గించుకోవడమే కాకుండా నాణ్యతతో రాజీపడి, అప్పులపాలయ్యే ప్రమాదం ఉంది. ఇప్పటికే పప్పులు, నూనెలు, కూరగాయల ధరలు కుటుంబ బడ్జెట్‌ను దెబ్బతీస్తున్నాయి. అక్టోబర్ 30న కేంద్ర ధరల పర్యవేక్షణ వ్యవస్థ కందిపప్పు కిలో ధర రూ.133.91, మినప్పప్పు రూ.126.48, పెసరపప్పు రూ.114.89గా నమోదు చేసింది. కొన్ని రిటైల్ మార్కెట్లలో ఇవి రూ.175 నుంచి రూ.200 వరకు పలుకుతున్నాయన్న యథార్థం. ఈ పరిస్థితుల్లో బియ్యం ధరల పెరుగుదల సామాన్యుడిపై మరింత భారం మోపుతోంది. కేంద్రం, రాష్ట్రాలు సమన్వయంతో అవసరమైనప్పుడు ప్రభుత్వ నిల్వలను మార్కెట్లోకి విడుదల చేయాలి. రైతులకు సకాలంలో కొనుగోలు భరోసా కల్పించడంతో పాటు రవాణా, మిల్లింగ్ ఖర్చులు, హోల్‌సేల్ మార్జిన్లపై పరిశీలన జరపాలి. ఎగుమతుల ప్రభావాన్ని అంచనా వేసి తగిన నిర్ణయాలు తీసుకోవాలి. ఏపీ, తెలంగాణలో జిల్లాలవారీగా ధరల బులెటిన్లు విడుదల చేసి, బియ్యం రకాలు, 25 కిలోల బస్తా ధరలు, నిల్వలు, సరఫరా వివరాలను వెల్లడించాలి. కిలో రూ.85-95కి చేరుతున్న సన్నబియ్యం ధరలను నిర్లక్ష్యం చేయలేం. అదే సమయంలో దేశవ్యాప్త సగటు రూ.48.23 ఆధారంగా అన్ని రకాల బియ్యం ధరలను ఒకేలా అంచనా వేయలేం. వాస్తవాలను వెలుగులోకి తెచ్చి, ఆరోపణలను ఆధారాలతో పరిశీలించి బాధ్యులపై చర్యలు తీసుకోవాలి. రైతుకు గిట్టుబాటు ధర, వినియోగదారుడికి సరసమైన ధర కల్పిస్తూ మధ్యలో అక్రమ లాభాలకు తావులేని వ్యవస్థను నిర్మించాలి. పాలకులకు ముడుపులే ముఖ్యమా? ప్రజల కడుపు నింపడం బాధ్యత కాదా? అన్న విమర్శలకు ప్రభుత్వాలు చేతలతో సమాధానం చెప్పాలి. సంక్షేమం అంటే పథకాల ప్రకటనలు మాత్రమే కాదు.. సామాన్యుడి కంచంలో అందుబాటు ధరకు అన్నం ఉండేలా చూడటం! ఇప్పటికైనా ధరల నియంత్రణకు చర్యలు తీసుకోకపోతే ఆహార భద్రతే ప్రశ్నార్థకమవుతుంది. రైతును కాపాడాలి.. వినియోగదారుడిని ఆదుకోవాలి. బియ్యం పండించే దేశంలోనే బియ్యం కొనలేని దుస్థితి ఎందుకు రావాలి?

• దక్షిణాదిలో ఒక్క తెలంగాణ, ఆంధ్రాలోనే ఎందుకీ ధరల మంట!

బియ్యం ధరల మంట ఆంధ్రప్రదేశ్, తెలంగాణకే పరిమితమైందా? లేక దక్షిణాది రాష్ట్రాలన్నింటినీ తాకిందా? సెప్టెంబర్ 2026 రాష్ట్రాల ధరల పోలికలో కర్ణాటకలో కిలో బియ్యం సగటు ధర రూ.63.75గా నమోదైంది. తెలంగాణలో రూ.61.87, తమిళనాడులో రూ.61.66గా ఉంది. అంటే ధరల ఒత్తిడి తెలుగు రాష్ట్రాలకే పరిమితం కాలేదని గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. అయితే రాష్ట్ర సగటు ధరలు అన్ని జిల్లాల్లో ఒకేలా ఉండవు. తమిళనాడులోని చెన్నై మార్కెట్ పరిస్థితి మరింత ఆందోళన కలిగిస్తోంది. అక్టోబర్ 27న వెలువడిన నివేదిక ప్రకారం కృష్ణా బ్రాండ్ ఉడికించిన పొన్నీ బియ్యం కిలో ధర సెప్టెంబర్‌లో రూ.61 ఉండగా, అక్టోబర్ చివరికి రూ.79కు చేరింది. యాపిల్ బ్రాండ్ పచ్చి బియ్యం రూ.58 నుంచి రూ.71కు పెరిగింది. కొన్ని బాస్మతి రకాల ధరలు 100 నుంచి పైకి ఎగబాకుతున్నాయి. అక్టోబర్ 12న వెలువడిన మరో నివేదిక ప్రకారం 26 కిలోల సూపర్‌ఫైన్ బియ్యం బస్తా ధర రూ.1,720 నుంచి రూ.1,950కు పెరిగింది. కేరళలో అక్టోబర్ 28న అధికారికంగా వెల్లడైన ధరల ప్రకారం ఆంధ్ర వెల్ల బియ్యం కిలో రూ.49.54, మట్ట బియ్యం రూ.56.07, చంబా బియ్యం రూ.56గా నమోదయ్యాయి. గత ఏడాదితో పోలిస్తే అక్కడా ధరలు పెరిగాయి. అయితే బియ్యం రకాలు, నాణ్యత, మార్కెట్ పరిస్థితులను పరిగణనలోకి తీసుకోకుండా ఈ ధరలను నేరుగా పోల్చడం సరికాదు. ఆంధ్రప్రదేశ్‌లోనూ ప్రాంతం, రకం ఆధారంగా ధరల్లో వ్యత్యాసాలున్నాయి. ఉత్పత్తి, రవాణా ఖర్చులు, స్థానిక డిమాండ్, బ్రాండ్ల సరఫరా, వ్యాపారుల నిల్వలు ధరలను ప్రభావితం చేస్తున్నాయి. అయినా కర్ణాటక, తెలంగాణ, తమిళనాడులో నమోదైన ధరలు దక్షిణాది బియ్యం మార్కెట్‌లో పెరుగుదల తీవ్రతను చాటుతున్నాయి. మరి ఈ పరిస్థితిని అడ్డుకోవడానికి ప్రభుత్వాలు తీసుకుంటున్న చర్యలేంటి? ముఖ్యంగా ఆంధ్రప్రదేశ్, తెలంగాణలో ధరల పెరుగుదలకు కారణాలపై సమగ్ర నివేదికలను ప్రజల ముందుంచుతున్నాయా? గణాంకాలు పెరుగుదలను చూపిస్తున్నాయి.. ప్రభుత్వాల చర్యలు మాత్రం స్పష్టంగా కనిపించడం లేదు!

- శ్రీరాం వెన్ను, సీనియర్ జర్నలిస్ట్





ఎవరి జనాభా ఎంత? ఎవరి వాటా ఎంత? దేశంలో సామాజిక న్యాయం అసలు లెక్క తేలబోతోందా? పదిహేనేళ్ల సుదీర్ఘ విరామం తర్వాత దేశం మరోసారి జనాభా లెక్కల కోసం సిద్ధమవుతోంది. కానీ ఈసారి లెక్కించేది కేవలం మనుషుల సంఖ్య మాత్రమే కాదు.. దేశ సామాజిక స్వరూపాన్ని, కులాల బలాబలాలను, ఆర్థిక అసమానతలను, అభివృద్ధి అవసరాలను కూడా! 2027 జనగణనలో తొలిసారిగా డిజిటల్ విధానంతో పాటు దేశవ్యాప్త కులగణనకు అవకాశం కల్పించడం రాజకీయంగా కొత్త చర్చకు తెరలేపుతోంది. ఏ కులం ఎంత? ఏ వర్గం ఎంత వెనుకబడి ఉంది? రిజర్వేషన్లపై ఎలాంటి ప్రభావం ఉండబోతోంది? సంక్షేమ పథకాల రూపకల్పన మారుతుందా? పార్లమెంటు నియోజకవర్గాల పునర్విభజనలో కొత్త సమీకరణాలు తెరపైకి వస్తాయా? ఇప్పటికే విపక్షాలు కులాల వర్గీకరణ, సమాచార సేకరణ విధానం, వ్యక్తిగత గోప్యతపై ప్రశ్నలు సంధిస్తుంటే.. కేంద్రం సమగ్ర గణాంకాలే లక్ష్యమని చెబుతోంది. జనవరి 25 నుంచి దేశవ్యాప్తంగా ఇంటింటి గణనకు రంగం సిద్ధమవుతోంది. ఈసారి నమోదయ్యే ప్రతి సంఖ్య రేపటి విధానాలకు పునాది కావచ్చు. ఇది కేవలం జనాభా లెక్క కాదు.. దేశ సామాజిక, రాజకీయ భవిష్యత్తును ప్రభావితం చేయగల మహా గణాంక యజ్ఞం!

పాపులేషన్ పల్స్@ 2027

జనాభా లెక్కలు తేడా వస్తే చుక్కలు

అనూహ్యంగా పెరిగిన పాపులేషన్

కులగణనతో కొత్త ఈక్వేషన్

ఒక దేశ జనాభా ఎంత? ఏ రాష్ట్రంలో ఎంతమంది నివసిస్తున్నారు? ఏ సామాజిక వర్గానికి ఎంత జనాభా ఉంది? ప్రజల జీవన ప్రమాణాలు ఎలా ఉన్నాయి? ఎన్ని కుటుంబాలకు బ్యాంకు ఖాతాలు, విద్య, ఉపాధి, డిజిటల్ సదుపాయాలు అందుబాటులో ఉన్నాయి? ఈ ప్రశ్నలకు సమాధానాలు అందించే జనాభా లెక్కలు కేవలం ప్రజల సంఖ్యను లెక్కించే కార్యక్రమం కాదు.. దేశ సామాజిక, ఆర్థిక స్వరూపాన్ని ఆవిష్కరించే కీలక ప్రక్రియ. భారత్‌లో చివరిసారిగా 2011లో జనగణన జరగగా, 2021లో కరోనా కారణంగా వాయిదా పడింది. దీంతో దాదాపు పదిహేనేళ్ల తర్వాత దేశం సమగ్ర జనాభా గణాంకాలను సేకరించబోతోంది. ఈ మధ్య కాలంలో పట్టణీకరణ, వలసలు, కుటుంబ వ్యవస్థ, విద్య, ఉపాధి రంగాల్లో అనేక మార్పులు చోటుచేసుకున్నాయి. గ్రామాల నుంచి పట్టణాలకు వలసలు పెరిగాయి. కుటుంబాల పరిమాణం మారింది. యువత, వృద్ధుల అవసరాలు పెరిగాయి. మహిళల ఉపాధి అవకాశాలు కొత్త సవాళ్లను సృష్టిస్తున్నాయి. దీంతో పాత గణాంకాల ఆధారంగా ప్రస్తుత అవసరాలను అంచనా వేయడం కష్టంగా మారింది. ఎక్కడ ఎన్ని పాఠశాలలు, ఆసుపత్రులు అవసరం? ఏ ప్రాంతానికి తాగునీరు, రహదారులు, గృహాలు కల్పించాలి? అనే అంశాలకు తాజా సమాచారం అవసరం. ఈసారి జనగణనలో కులగణనను కూడా చేర్చడం ప్రత్యేక ప్రాధాన్యం సంతరించుకుంది. డిజిటల్ విధానంలో వివరాల సేకరణతో పాటు ప్రజలకు స్వయంగా తమ వివరాలు నమోదు చేసుకునే అవకాశం కల్పిస్తున్నారు. ఫలితంగా దేశ జనాభా సంఖ్యతో పాటు సామాజిక వర్గాల స్థితిగతులు, ప్రాంతాల అభివృద్ధి అవసరాలు, సంక్షేమ పథకాల రూపకల్పనకు అవసరమైన కీలక సమాచారం అందుబాటులోకి రానుంది. అందుకే 2027 జనాభా లెక్కలపై రాజకీయ పార్టీలు, రాష్ట్ర ప్రభుత్వాలు, సామాజిక సంఘాల్లో ఆసక్తి పెరిగింది.

•ఎప్పుడు.. ఎలా..
రెండు దశల్లో దేశవ్యాప్త గణన!

2027 జనాభా లెక్కల నిర్వహణకు కేంద్ర ప్రభుత్వం రెండు దశల్లో కార్యాచరణ రూపొందించింది. మొదటి దశలో 2026 ఏప్రిల్ 1 నుంచి సెప్టెంబర్ 30 వరకు ఇళ్ల జాబితా తయారీ, గృహ గణన చేపట్టారు. ఇందులో ఇంటి నిర్మాణం, యాజమాన్యం, గదుల సంఖ్య, తాగునీరు, విద్యుత్, మరుగుదొడ్డి, వంటగ్యాస్, అంతర్జాలం, టీవీ, సెల్‌ఫోన్, వాహనాలు వంటి వివరాలను 33 ప్రశ్నల ద్వారా సేకరించారు. రెండో దశలో అసలు జనాభా గణన చేపడతారు. కేంద్ర హోంశాఖ అక్టోబర్ 30న విడుదల చేసిన ప్రకటన ప్రకారం, దేశంలోని ప్రధాన ప్రాంతాల్లో 2027 జనవరి 25 నుంచి ఫిబ్రవరి 28 వరకు ఇంటింటి గణన జరుగుతుంది. దీనికి ముందు జనవరి 10 నుంచి 24 వరకు ప్రజలు ప్రత్యేక అంతర్జాల వేదిక ద్వారా స్వయంగా కుటుంబ వివరాలను నమోదు చేసుకోవచ్చు. అనంతరం మార్చి 1 నుంచి 5 వరకు పునఃపరిశీలన నిర్వహిస్తారు. ఈ జనగణనకు ప్రామాణిక తేదీ 2027 మార్చి 1 అర్ధరాత్రి 12 గంటలు. అయితే ఎన్నికల నేపథ్యంలో ఉత్తరప్రదేశ్, గోవా, పంజాబ్, ఉత్తరాఖండ్ రాష్ట్రాల్లో ముందుగానే ఈ ప్రక్రియ చేపడుతున్నారు. అక్కడ నవంబర్ 16 నుంచి స్వీయ గణన, డిసెంబర్ 1 నుంచి జనవరి 4 వరకు ఇంటింటి గణన, జనవరి 5 నుంచి 9 వరకు పునఃపరిశీలన జరుగుతుంది. లడఖ్, హిమాచల్ ప్రదేశ్, జమ్మూకశ్మీర్‌లోని మంచు ప్రభావిత ప్రాంతాల్లో సెప్టెంబర్ 30 నాటికే గణన పూర్తయింది. జాతి ఘర్షణల కారణంగా మణిపూర్‌లో మాత్రం తదుపరి ప్రకటన వచ్చే వరకు జనగణన వాయిదా వేశారు. ఎన్నికలు, వాతావరణ పరిస్థితులు, భద్రతా సమస్యలను పరిగణనలోకి తీసుకొని రాష్ట్రాల వారీగా వేర్వేరు తేదీలను కేంద్రం నిర్ణయించింది.

• కులగణనే అసలు ప్రత్యేకత..
ఎవరి జనాభా ఎంత?

2027 జనాభా లెక్కల్లో అత్యంత కీలకమైన అంశం కులగణన. స్వాతంత్ర్యం తర్వాత సాధారణ జనగణనలో షెడ్యూల్డ్ కులాలు, తెగలు మినహా ఇతర కులాల సమగ్ర జనాభా వివరాలను సేకరించలేదు. బ్రిటిష్ పాలనలో 1931లో చివరిసారిగా విస్తృత స్థాయిలో కులాల వారీగా లెక్కలు నమోదయ్యాయి. అప్పటి నుంచి దేశవ్యాప్త కులగణన కోసం వెనుకబడిన వర్గాల సంఘాలు, సామాజిక ఉద్యమాలు, రాజకీయ పార్టీలు డిమాండ్ చేస్తున్నాయి. బీహార్, తెలంగాణ వంటి రాష్ట్రాలు ప్రత్యేక కుల సర్వేలు నిర్వహించాయి. ఈ నేపథ్యంలో 2025 ఏప్రిల్ 30న కేంద్ర మంత్రిపర్గ రాజకీయ వ్యవహారాల కమిటీ తదుపరి జనగణనలో కులగణనను చేర్చాలని నిర్ణయించింది. దీంతో ఎస్సీ, ఎస్టీలతో పాటు ఇతర కులాల వివరాలు కూడా సేకరించనున్నారు. రెండో దశలో 40 ప్రశ్నలతో కూడిన ప్రశ్నావళిని రూపొందించారు. వ్యక్తి పేరు, వయసు, లింగం, వివాహ స్థితి, జాతీయత, మతం, కులం, తల్లిదండ్రుల పేర్లు, వారి పుట్టిన తేదీ, జన్మస్థలం వంటి వివరాలు నమోదు చేస్తారు. మాతృభాష, విద్య, అక్షరాస్యత, ఉపాధి, వలసలు, డిజిటల్ పరిజ్ఞానం, బ్యాంకు ఖాతాలు, శాశ్వత చిరునామా వివరాలతో పాటు అందుబాటులో ఉంటే ఆధార్, సెల్‌ఫోన్, ఓటరు గుర్తింపు కార్డు సంఖ్యలను కూడా అడుగుతారు. పాస్‌పోర్టు, డ్రైవింగ్ లైసెన్స్, కొవిడ్ టీకా వివరాలకు కూడా స్థానం కల్పించారు. ఈ ప్రశ్నల్లో 13 కొత్త అంశాలు ఉండటం ప్రత్యేకత. అయితే కులాల పేర్లను స్వయంగా నమోదు చేసే విధానంలో సవాళ్లు ఎదురయ్యే అవకాశం ఉంది. ఒకే కులానికి ప్రాంతాలవారీగా వేర్వేరు పేర్లు ఉండటం, ఉపకులాల గుర్తింపు, ఉచ్చారణలో తేడాలు గణాంకాల వర్గీకరణను క్లిష్టతరం చేయవచ్చు. అందువల్ల కులగణనలో జనాభా సంఖ్య ఎంత అనేది ఎంత ముఖ్యమో, కులాల గుర్తింపు, వివరాల నమోదు ఖచ్చితంగా జరగడం కూడా అంతే ముఖ్యం. అప్పుడే తుది గణాంకాలు దేశ సామాజిక వాస్తవికతను ప్రతిబింబిస్తాయి.

• జనాభా లెక్కలతో మారేదేమిటి..
రిజర్వేషన్లతో రాజకీయ ప్రాతినిధ్యం!

జనాభా లెక్కల ఫలితాలు దేశ భవిష్యత్తు విధానాలపై ప్రభావం చూపనున్నాయి. ముఖ్యంగా కులగణనతో ప్రతి సామాజిక వర్గం జనాభా, పేదరికం, విద్య, ఉపాధి, ప్రభుత్వ ఉద్యోగాల్లో ప్రాతినిధ్యం వంటి అంశాలపై స్పష్టత వచ్చే అవకాశం ఉంది. ఈ సమాచారం రిజర్వేషన్లు, సంక్షేమ పథకాలు, సామాజిక అభివృద్ధి కార్యక్రమాల సమీక్షకు ఉపయోగపడుతుంది. అయితే ఒక కులం జనాభా ఎక్కువగా ఉందని రిజర్వేషన్లు ఆటోమేటిక్‌గా పెరగవు. రాజ్యాంగ నిబంధనలు, న్యాయస్థానాల తీర్పులు, చట్టపరమైన పరిమితులు, ప్రభుత్వ నిర్ణయాలు కూడా అవసరం. ఆర్థిక ప్రణాళికలోనూ జనాభా గణాంకాలు కీలకం. పిల్లలు ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో పాఠశాలలు, అంగన్‌వాడీలు, ఆరోగ్య కేంద్రాలు, వృద్ధులు అధికంగా ఉన్న ప్రాంతాల్లో ఆసుపత్రులు, పింఛను సదుపాయాలు పెంచేందుకు ఇవి దోహదపడతాయి. పట్టణాల్లో తాగునీరు, రవాణా, గృహ నిర్మాణం, పారిశుధ్యం వంటి అవసరాలను అంచనా వేయవచ్చు. గ్రామీణ ప్రాంతాల్లో వ్యవసాయంపై ఆధారపడిన కుటుంబాలు, ఉపాధి కోసం వలస వెళ్లేవారి వివరాలతో ప్రత్యేక పథకాలు రూపొందించవచ్చు. కేంద్రం నుంచి రాష్ట్రాలకు, స్థానిక సంస్థలకు నిధుల కేటాయింపులోనూ జనాభా ఒక ముఖ్యమైన ప్రాతిపదిక. అయితే ఆర్థిక సంఘం సిఫార్సులు, రాష్ట్రాల ఆదాయ సామర్థ్యం, అభివృద్ధి అవసరాలు కూడా పరిగణనలోకి వస్తాయి. రాజకీయ ప్రాతినిధ్యంలోనూ ఈ గణాంకాలకు ప్రాధాన్యం ఉంటుంది. లోక్‌సభ, శాసనసభ నియోజకవర్గాల పునర్విభజన, మహిళా రిజర్వేషన్ల అమలుపై జరిగే చర్చలకు ఇవి ఆధారంగా మారవచ్చు. అయితే జనగణన పూర్తయిన వెంటనే నియోజకవర్గాల సంఖ్య మారదు. అందుకు ప్రత్యేక రాజ్యాంగ, చట్టపరమైన ప్రక్రియలు అవసరం. మొత్తంగా జనాభా లెక్కలు ప్రజల సంఖ్యను మాత్రమే వెల్లడించవు.. వారి అవసరాలు, అవకాశాలు, అభివృద్ధిలోని అంతరాలను గుర్తించేందుకు ప్రభుత్వాలకు మార్గం చూపుతాయి.



• విపక్షాల వాదన ఏమిటి..
ప్రభుత్వం చెబుతున్నదేమిటి?

కులగణనకు పలు రాజకీయ పార్టీలు మద్దతు ప్రకటిస్తున్నప్పటికీ, దాని అమలు విధానంపై భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. కాంగ్రెస్, సమాజ్‌వాదీ పార్టీ సహా విపక్షాలు దేశవ్యాప్త కులగణనను చాలాకాలంగా కోరుతున్నాయి. అయితే కులాల వివరాల సేకరణ, ప్రశ్నావళి రూపకల్పన, సమాచార భద్రతపై కాంగ్రెస్ అభ్యంతరాలు వ్యక్తం చేస్తోంది. ప్రజలు స్వయంగా కులం పేరు చెప్పే విధానం వల్ల ఒకే కులానికి వేర్వేరు పేర్లు నమోదయ్యే ప్రమాదం ఉందని, అందువల్ల ముందుగా రూపొందించిన కులాల జాబితా, ప్రత్యేక సంకేత విధానం ఉపయోగించాలని కోరుతోంది. మతం, తల్లిదండ్రుల పుట్టిన ప్రదేశాలు, ఆధార్, సెల్‌ఫోన్, ఓటరు గుర్తింపు సంఖ్యలు ఎందుకు సేకరిస్తున్నారు? వాటిని ఎలా భద్రపరుస్తారు? అనే ప్రశ్నలను కూడా లేవనెత్తుతోంది. జనాభా లెక్కలు, జాతీయ జనాభా పట్టిక, జాతీయ పౌర పట్టిక మధ్య సంబంధాలపైనా చర్చ సాగుతోంది. మరోవైపు కేంద్రం కులగణనను సాధారణ జనగణనలో భాగంగా నిర్వహిస్తున్నామని, అంతర్జాల ఆధారిత విధానంతో వేగంగా వివరాలు సేకరించవచ్చని చెబుతోంది. స్వీయ గణనతో ప్రజలకు సౌలభ్యం కలుగుతుందని, వ్యక్తిగత వివరాలకు చట్టపరమైన రక్షణ ఉంటుందని స్పష్టం చేస్తోంది. 1948 జనగణన చట్టంలోని 15వ అధికరణం ప్రకారం వ్యక్తిగత వివరాలను బహిర్గతం చేయడానికి, న్యాయస్థానాల్లో సాక్ష్యంగా ఉపయోగించడానికి వీలుండదు. ఈ భారీ కార్యక్రమానికి కేంద్రం రూ.11,718.24 కోట్ల నిధులు కేటాయించగా, దేశవ్యాప్తంగా సుమారు 30 లక్షల మంది సిబ్బంది పాల్గొననున్నారు. వేగవంతమైన సమాచార సేకరణ, పారదర్శకత, కులాల సరైన వర్గీకరణ, వ్యక్తిగత గోప్యత.. ఇవే ఇప్పుడు ప్రధాన చర్చనీయాంశాలు. సేకరించిన వివరాలు ఎంత కచ్చితంగా ఉంటాయి? వాటిని ఎలా విశ్లేషిస్తారు? ప్రజా సంక్షేమానికి ఎలా ఉపయోగిస్తారు? అన్నదానిపైనే ఈ జనగణన విశ్వసనీయత ఆధారపడి ఉంటుంది.

• డిజిటల్ జనగణన..
ప్రజల భాగస్వామ్యమే కీలకం!

సౌకర్యం లేని కుటుంబాలకు జనగణన సిబ్బంది సహాయం అందిస్తారు. ఈ విధానంతో సమాచార సేకరణ వేగవంతం కావడంతో పాటు తప్పులను గుర్తించడం సులభమవుతుందని ప్రభుత్వం భావిస్తోంది. అయితే వృద్ధులు, నిరక్షరాస్యులు, వలస కార్మికులు, నిరాశ్రయుల వివరాలు కూడా కచ్చితంగా నమోదు కావాలి. ఎవరూ గణన నుంచి మినహాయించబడకూడదు. ప్రజలు కుటుంబ సభ్యుల సంఖ్య, వయసు, విద్య, ఉపాధి, కులం, మతం, నివాస వివరాలను నిజాయితీగా తెలియజేయాలి. సిబ్బంది పక్షపాతం లేకుండా నమోదు చేయాలి. ముఖ్యంగా కులాల పేర్లు, ఉపకులాల గుర్తింపులో జాగ్రత్త అవసరం. వ్యక్తిగత సమాచార భద్రత, కులాల వర్గీకరణ, తుది గణాంకాల ప్రకటనలో ప్రభుత్వం పారదర్శకత పాటించాలి. కేవలం కులాల జనాభా సంఖ్యలు ప్రకటించడం కాకుండా ఆయా వర్గాల్లో పేదరికం, విద్య, ఉద్యోగ అవకాశాలు, మహిళల స్థితిగతులను కూడా విశ్లేషించాలి. జనాభా లెక్కలు దేశానికి అద్దం పడతాయి. ఆ అద్దంలో కనిపించే వాస్తవాలను గుర్తించి, సమాన అవకాశాలు కల్పించడమే ప్రభుత్వాల అసలు బాధ్యత. ఈ గణాంకాలు రాజకీయ చర్చలకే పరిమితం కాకుండా విద్య, ఉపాధి, ఆరోగ్యం, సంక్షేమం, ప్రాంతీయ అభివృద్ధికి ఉపయోగపడినప్పుడే 2027 జనగణన లక్ష్యం నెరవేరుతుంది. రాబోయే దశాబ్దపు దేశాభివృద్ధికి ఈ సమాచారం పునాదిగా నిలవాలి.

ఈసారి జనాభా లెక్కల్లో కీలక మార్పు డిజిటల్ విధానం. స్వాతంత్ర్యం తర్వాత తొలిసారిగా దేశవ్యాప్తంగా జనాభా వివరాలను ప్రధానంగా డిజిటల్ సాధనాలతో సేకరించనున్నారు. గతంలో కాగితపు ప్రశ్నావళిలో నమోదు చేసిన వివరాలను తర్వాత కంప్యూటర్లలోకి మార్చేవారు. ఇప్పుడు ప్రత్యేక సెల్‌ఫోన్ ద్వారా నేరుగా వివరాలు నమోదు చేస్తారు. జనగణన నిర్వహణ, పర్యవేక్షణ వ్యవస్థ ద్వారా జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిలో పురోగతిని పరిశీలిస్తారు. ప్రజలు స్వయంగా వివరాలు నమోదు చేసుకునే సదుపాయం 16 భాషల్లో అందుబాటులో ఉంటుంది. అంతర్జాల





అభిమానులున్నారు.. నాయకులున్నారు..
పార్టీకి ఓటు వేయించగలిగే కార్యకర్తలేరీ?
నగరాల్లో తడబాటు.. నిర్వహణలో వెనుకబాటు

వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి నాయకులు ఉన్నారు. జగన్‌పై అపారమైన అభిమానం చూపించే అభిమానులూ ఉన్నారు. పార్టీ కోసం గళమెత్తే నేతలు, సోషల్ మీడియాలో ప్రత్యర్థులను నిలదీసే కార్యకర్తలూ కనిపిస్తున్నారు. కానీ ఎన్నికల క్షేత్రంలో పార్టీకి అత్యంత అవసరమైన బలమైన కేడర్ మాత్రం కనిపించడం లేదు. నాయకుల ప్రకటనలు, అభిమానుల నినాదాలు ఎన్నికల్లో విజయాన్ని అందించలేవు. ఓటర్లను నేరుగా కలవడం, పార్టీకి అనుకూలంగా వారిని ప్రభావితం చేయడం, పోలింగ్ కేంద్రాల వరకు తీసుకురావడం, ఓటింగ్ ప్రక్రియ పూర్తయ్యే వరకు అప్రమత్తంగా ఉండటం వంటి బాధ్యతలను నిర్వహించే కార్యకర్తల వ్యవస్థ అవసరం. వైసీపీ ప్రస్తుతం ఎదుర్కొంటున్న ప్రధాన సమస్య ఇదే. గత ఎన్నికల్లో ఎదురైన ఘోర పరాజయం నుంచి పార్టీ ఎంతవరకు పాఠాలు నేర్చుకుందనే ప్రశ్న ఇప్పుడు రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. ఒకవైపు తెలుగుదేశం పార్టీ స్థానిక ఎన్నికల్లో తమదే ఏకపక్ష విజయమని ధీమా వ్యక్తం చేస్తోంది. మరోవైపు కూటమి ప్రభుత్వంపై ప్రజల్లో వ్యతిరేకత పెరిగిందని, ఆ ప్రభావం ఎన్నికల్లో తమకు అనుకూలంగా మారుతుందని వైసీపీ నాయకత్వం భావిస్తోంది. రెండు పార్టీల వాదనల్లో ఎవరి అంచనాలు నిజమవుతాయో త్వరలో వెల్లడయ్యే ఫలితాలు స్పష్టం చేయనున్నాయి. ముఖ్యంగా పట్టణాలు, నగరాల్లో ఏ పార్టీకి ప్రజల మద్దతు ఉందనే విషయం ఆసక్తికరంగా మారింది. గ్రామీణ ప్రాంతాల్లో పార్టీకి ఉన్న పరిచయాలు, నాయకుల వ్యక్తిగత ప్రభావం ఒక ఎత్తయితే, పట్టణాల్లో ఓటర్లను సమీకరించడం మరో ఎత్తు. ఇక్కడ బలమైన స్థానిక నాయకత్వం, నిరంతరం ప్రజల్లో ఉండే కార్యకర్తలు, పటిష్ఠమైన ఎన్నికల నిర్వహణ కీలకం. గత అసెంబ్లీ ఎన్నికల్లో కూటమి భారీ ఆధిక్యతతో అధికారాన్ని చేజిక్కించుకోగా, వైసీపీ తీవ్ర పరాజయాన్ని చవిచూసింది. అయినప్పటికీ దాదాపు 40 శాతం ఓట్లతో వైసీపీ తన ఉనికిని చాటుకుంది. ఈ ఓటు శాతాన్ని పార్టీ బలంగా మార్చుకోవాలంటే అభిమానాన్ని సంస్థాగత శక్తిగా మలచాలి. కేవలం గత ఓట్ల లెక్కలు చెప్పుకుంటూ భవిష్యత్తు విజయాన్ని ఆశించడం సాధ్యం కాదు. ప్రస్తుతం స్థానిక ఎన్నికలు వైసీపీ బలాబలాలకు పరీక్షగా నిలుస్తున్నాయి.

సక్సెస్ ఫార్ములాపై సస్పెన్స్

వైసీపీకి గెలుపు అంత ‘వీజీ’ కాదు!

కూటమి దూకుడు..
వైసీపీకు సవాలు

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి దాదాపు రెండున్నర సంవత్సరాలు కావస్తున్న నేపథ్యంలో అభివృద్ధి, పరిశ్రమలు, పెట్టుబడులను ప్రధాన అజెండాగా ముందుకు తీసుకెళ్తున్నామని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయకత్వంలోని ప్రభుత్వం చెబుతోంది. మరోవైపు స్థానిక సంస్థల ఎన్నికలను రాజకీయంగా ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్న కూటమి నాయకత్వం వైసీపీకు పూర్తిస్థాయిలో అడ్డుకట్ట వేయాలనే లక్ష్యంతో పనిచేస్తోంది. ముఖ్యంగా వైసీపీకు సంప్రదాయ బలమున్న రాయలసీమ ప్రాంతంలో కొన్ని స్థానాలు ఏకగ్రీవం కావడం, మరికొన్ని చోట్ల ప్రత్యర్థులు నామినేషన్లు దాఖలు చేయలేని పరిస్థితులు ఏర్పడటం రాజకీయంగా ప్రాధాన్యత సంతరించుకున్నాయి. ఈ పరిణామాలను కూటమి తమ విజయంగా ప్రచారం చేసుకుంటోంది. అయితే ఏకగ్రీవాలు, నామినేషన్ల పరిస్థితుల వెనుక స్థానిక రాజకీయ సమీకరణాలు, అభ్యర్థుల బలం, పోటీ పరిస్థితులు కూడా ఉంటాయి. అందువల్ల వీటినే రాష్ట్రవ్యాప్త ప్రజాభిప్రాయానికి కొలమానంగా చూడలేము. అయినప్పటికీ ప్రత్యర్థి పార్టీకి బలమైన ప్రాంతాల్లోనే కూటమి దూకుడు ప్రదర్శించడం వైసీపీకు హెచ్చరికగా మారింది. ఇదే సమయంలో స్థానిక ఎన్నికల సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా చోటుచేసుకుంటున్న ఘర్షణలు, దాడులు, నామినేషన్ పత్రాల చించివేతలు, ప్రత్యర్థులపై దాడుల ఆరోపణలు ప్రజల్లో ఆందోళన కలిగిస్తున్నాయి. చంద్రబాబు రాజకీయ ప్రస్థానంలో వ్యూహాత్మక నిర్ణయాలు, రాజకీయ చతురతకు ప్రత్యేక గుర్తింపు ఉంది. కుప్పం నుంచి జాతీయ రాజకీయాల్లో కీలక పాత్ర పోషించే స్థాయికి ఎదిగిన ఆయన అనుభవం తెలుగుదేశం పార్టీకి బలంగా నిలిచింది. అయితే ఈసారి స్థానిక ఎన్నికల సందర్భంగా టీడీపీ శ్రేణులపై కూడా దాడులకు పాల్పడుతున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ప్రత్యర్థి పార్టీలు పరస్పరం ఒకరిపై మరొకరు నిందలు వేసుకుంటున్నాయి. ఏ ప్రాంతంలో ఎవరు దాడి చేశారనే అంశంపై రాజకీయ పార్టీల ప్రకటనలు, మీడియా కథనాలు భిన్నంగా ఉండటంతో వాస్తవ పరిస్థితిపై ప్రజల్లో అయోమయం నెలకొంది. ఎన్నికల పోటీ ఎంత తీవ్రంగా ఉన్నా ప్రజాస్వామ్య పద్ధతిలో ప్రచారం చేయడం, స్వేచ్ఛగా నామినేషన్లు దాఖలు చేసుకునే అవకాశం కల్పించడం, ఓటర్లు భయపడకుండా ఓటు వేసే పరిస్థితులు కల్పించడం పార్టీల బాధ్యత. అధికారంలో ఉన్న కూటమికి సహజంగానే అనుకూలతలు ఉండవచ్చనే అంచనాలు ఉన్నాయి. అదే సమయంలో ప్రభుత్వ వ్యతిరేకత తమకు లాభిస్తుందని వైసీపీ ఆశిస్తోంది.

జగన్ చుట్టూనే పార్టీ..
కేడర్‌కు ప్రాధాన్యత ఏది?

వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆవిర్భావం నుంచి ఇప్పటి వరకు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వ్యక్తిగత నాయకత్వంపైనే ఎక్కువగా ఆధారపడుతూ వచ్చింది. పార్టీ నిర్మాణం, రాజకీయ ప్రచారం, ఎన్నికల వ్యూహం, నిర్ణయాలు ఇలా ప్రతి అంశంలో జగన్ కేంద్రబిందువుగా నిలిచారు. పార్టీ ప్రారంభ దశలో జరిగిన ఉప ఎన్నికల నుంచి 2014 అసెంబ్లీ ఎన్నికలు, 2019లో సాధించిన ఘన విజయం వరకు జగన్ ఒంటిచేత్తో పార్టీని ముందుకు నడిపించారు. ఆయన ప్రజాదరణ, వైఎస్ రాజశేఖర్‌రెడ్డి కుటుంబంపై ఉన్న అభిమానం పార్టీకి ప్రధాన పెట్టుబడిగా మారాయి. అయితే ఈ విధానం వల్ల ద్వితీయ శ్రేణి నాయకత్వం బలపడలేదనే విమర్శలు మొదటి నుంచీ ఉన్నాయి. ఐదేళ్ల అధికారంలో కూడా సీనియర్ నాయకులు పార్టీని స్ట్రెంథెన్ చేసేలా వ్యవహరించలేకపోయారన్న భావన ఉంది. ఇందుకు అనేక కారణాలూ నేతలు చెప్తారు. మంత్రులు, ఎమ్మెల్యేలు, జిల్లా స్థాయి నాయకులు ఉన్నప్పటి.. తుది నిర్ణయం హైకమాండ్ నుంచి వచ్చే ఆదేశాలను బట్టే ఉండటం ఇబ్బందికరంగా ఉందన్న వాదన ఉంది. ఒక నాయకుడి చుట్టూ పార్టీ మొత్తం తిరగడం ప్రారంభంలో విజయాలు అందించినా, దీర్ఘకాలంలో సంస్థాగత బలాన్ని దెబ్బతీసే ప్రమాదం ఉంది. వైసీపీకు అదే సమస్యగా మారిందనే విశ్లేషణ ఉంది.

ముఖ్యంగా గ్రామస్థాయిలో పనిచేసే కార్యకర్తలకు తగిన గుర్తింపు, బాధ్యతలు, ప్రాధాన్యత కల్పించలేకపోయారనే అసంతృప్తి పెరిగింది. వాలంటీర్ వ్యవస్థ ఏర్పాటుతో పార్టీ కార్యకర్తల పాత్ర తగ్గిపోయిందనే అభిప్రాయం కూడా అప్పట్లో వినిపించింది. ప్రభుత్వ పథకాల అమలులో గ్రామ, వార్డు సచివాలయ సిబ్బంది కీలకంగా మారడంతో స్థానిక నాయకులు, కార్యకర్తలకు ప్రజలతో సంబంధాలు పెంచుకునే అవకాశాలు తగ్గాయని కొందరు భావించారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పథకాల గురించి వివరించడం, లబ్ధిదారులను గుర్తించడం వంటి పనులు వ్యవస్థల ద్వారా జరిగిపోవడంతో పార్టీ కార్యకర్తలకు రాజకీయంగా ప్రాధాన్యత తగ్గింది. బటన్ నొక్కి నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లో నగదు జమ చేయడమే సంక్షేమ పాలనకు ప్రధాన గుర్తింపుగా జగన్ భావించినా, పార్టీ అంతర్గతంగా పెరుగుతున్న అసంతృప్తిని పూర్తిస్థాయిలో గుర్తించలేకపోయారనే విమర్శ ఉంది. ఎన్నికల్లో కార్యకర్తల సహకారం ఎంత ముఖ్యమో పరాజయం తర్వాత స్పష్టమైంది. ఓటమి అనంతరం కార్యకర్తలకు పెద్దపీట వేస్తానని జగన్ ప్రకటించడం కూడా ఈ సమస్య తీవ్రతను తెలియజేసింది. అయితే ప్రకటనలకు, ఆచరణకు మధ్య ఉన్న దూరం ఇప్పటికీ తగ్గలేదనే అభిప్రాయం పార్టీ శ్రేణుల్లో వినిపిస్తోంది.

ఇదే వైసీపీకి తగిన సమయమంటున్న నాయకగణం..!

ప్రస్తుత స్థానిక సంస్థల ఎన్నికల్లో వైసీపీ ఆశించిన స్థాయిలో ఫలితాలు సాధించకపోయినా, వచ్చే అసెంబ్లీ ఎన్నికల నాటికి పార్టీని బలోపేతం చేసుకోవాలని కార్యకర్తలు, అభిమానులు కోరుకుంటున్నారు. జగన్‌పై ఉన్న వ్యక్తిగత అభిమానం పార్టీకి ఇప్పటికీ ఒక ప్రధాన బలంగా ఉందనడంలో సందేహం లేదు. అయితే ఆ అభిమానాన్ని సంస్థాగత శక్తిగా మార్చకపోతే రాజకీయ ప్రయోజనం పరిమితంగానే ఉంటుందని వారు భావిస్తున్నారు. ద్వితీయ శ్రేణి నాయకులకు బాధ్యతలు అప్పగించడం, నియోజకవర్గాల వారీగా నాయకులతో నిరంతర సమావేశాలు నిర్వహించడం, గ్రామాలు, పట్టణాల్లో కార్యకర్తలను గుర్తించి వారికి తగిన ప్రాధాన్యత కల్పించడం తక్షణ అవసరంగా మారింది. పార్టీ అధికారంలోకి రావాలంటే ఒక్క నాయకుడి కృషి మాత్రమే సరిపోదు. ప్రతి స్థాయిలో నాయకులు, కార్యకర్తలు కలిసికట్టుగా పనిచేయాలి. ఒకరి నిర్ణయాలకే పార్టీ పరిమితమైతే ఇతర నాయకుల్లో అసంతృప్తి పెరిగే ప్రమాదం ఉంటుంది. స్థానికంగా బలమైన నాయకత్వాన్ని ప్రోత్సహించాలి. ప్రజా సమస్యలపై పోరాటాలు నిర్వహించాలి. పార్టీకి దూరమైన వారిని తిరిగి దగ్గరకు తీసుకురావాలి. ముఖ్యంగా నగరాల్లో పార్టీ ఉనికిని పెంచడానికి ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలి. పట్టణ ప్రాంతాల్లో ప్రతి డివిజన్‌కు బాధ్యులను నియమించి, వార్డు స్థాయిలో ప్రజలతో సంబంధాలు కొనసాగించాలి. రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో తమదే విజయం అని జగన్ ధీమా వ్యక్తం చేస్తుంటే.. అందుకు గ్రౌండ్ ప్రిపేర్ చేయాల్సింది నాయకులే. ప్రభుత్వంపై వ్యతిరేకత పెరుగుతోందని, ఆ పరిణామాలు తమకు అనుకూలంగా మారతాయని జగన్ భావిస్తున్నారు. త్వరలో పాదయాత్ర చేపడతానని ప్రకటించడం కూడా పార్టీకి కొత్త ఊపిరి తీసుకువస్తుందని నాయకులు ఆశిస్తున్నారు. గతంలో జగన్ పాదయాత్ర ప్రజల్లో పార్టీకి గణనీయమైన ఆదరణ తీసుకొచ్చిన విషయం తెలిసిందే. అయితే ఈసారి కూడా అదే ఫలితం రావాలంటే పాదయాత్రతో పాటు పార్టీ నిర్మాణంపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలి. నాయకత్వం ప్రజల్లోకి వెళ్లడం ఎంత ముఖ్యమో, స్థానిక నాయకులు ప్రజలకు అందుబాటులో ఉండటం కూడా అంతే ముఖ్యం. ప్రభుత్వ వ్యతిరేకత ఒక్కటే ప్రతిపక్షానికి విజయాన్ని అందించదు. ఆ వ్యతిరేకతను ఓట్లుగా మార్చే సమర్థమైన వ్యవస్థ ఉండాలి. అందుకే ప్రస్తుత స్థానిక ఎన్నికలు వైసీపీకు కేవలం గెలుపోటముల పరీక్ష మాత్రమే కాదు, పార్టీ అంతర్గత బలాబలాలను తెలుసుకునే అవకాశంగా కూడా మారాయి. ఇప్పటికైనా జగన్ వాస్తవ పరిస్థితులను అంచనా వేసి, కార్యకర్తలకు ప్రాధాన్యత ఇచ్చి, నాయకత్వాన్ని వికేంద్రీకరించి, ఎన్నికల నిర్వహణను పటిష్ఠం చేయాలని రాజకీయ విశ్లేషకులు సూచిస్తున్నారు. అందుకే వైసీపీ నేతలే ఇప్పుడు ఆలోచించాల్సిన ప్రశ్న ఒక్కటే.. అభిమానాన్ని ఓటుగా మార్చే కార్యకర్తలు ఎక్కడ? ఆ ప్రశ్నకు సమాధానం వెతికి, పార్టీ నిర్మాణంలో మార్పులు తీసుకొస్తేనే భవిష్యత్తులో అధికారానికి చేరువయ్యే అవకాశం ఉంటుంది. లేకపోతే వైసీపీకు గెలుపు నిజంగానే అంత ‘వీజీ’ కాదు!

– కేసోనపల్లి కోటేశ్వరరావు,

అభిమానులున్నారు..
కార్యాచరణ ఎక్కడ?

ఓటమి తర్వాత పార్టీని పునర్నిర్మించుకుంటామని, కార్యకర్తలకు తగిన ప్రాధాన్యత కల్పిస్తామని జగన్ ఇచ్చిన హామీ క్షేత్రస్థాయిలో ఎంతవరకు అమలైందనేది ఇప్పుడు కీలక ప్రశ్నగా మారింది. పట్టణాలు, గ్రామీణ ప్రాంతాల్లో వైసీపీకు అభిమానులు ఉన్నప్పటికీ వారందరినీ క్రియాశీల కార్యకర్తలుగా మార్చడంలో పార్టీ విఫలమవుతోందనే విమర్శలు ఉన్నాయి. జగన్‌పై వ్యక్తిగత విశ్వాసంతో పార్టీకి మద్దతు ఇచ్చే వారు చాలామందే ఉన్నారు. కానీ ఎన్నికల సమయంలో వారిని ఒక బలమైన బృందంగా సమీకరించడం, ప్రాంతాల వారీగా బాధ్యతలు అప్పగించడం, ప్రతి పోలింగ్ కేంద్రం పరిధిలో ఓటర్లతో నిరంతర సంబంధాలు కొనసాగించడం వంటి చర్యలు కనిపించడం లేదనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. పార్టీ మళ్లీ అధికారంలోకి వస్తే పరిస్థితులు మారతాయని అభిమానులు ఆశిస్తున్నప్పటికీ, ఆ ఆశను ఎన్నికల విజయంగా మార్చేందుకు అవసరమైన కార్యాచరణ మాత్రం స్పష్టంగా కనిపించడం లేదు. మరోవైపు పార్టీకి చెందిన కొందరు నాయకులపై ఆరోపణలు, అరెస్టులు, విచారణలు, కుటుంబ వివాదాలు రాజకీయంగా చర్చకు వస్తున్నాయి. ఇవన్నీ పార్టీ నాయకత్వానికి అదనపు సవాళ్లుగా మారుతున్నాయి. ఇటువంటి పరిస్థితుల్లో పార్టీని బలోపేతం చేయడానికి, స్థానిక నాయకులతో సమావేశాలు నిర్వహించడానికి, కార్యకర్తలకు ధైర్యం కల్పించడానికి జగన్ ఎక్కువ సమయం కేటాయించాల్సిన అవసరం ఉంది. కానీ పార్టీ అంతర్గత వ్యవస్థను చక్కదిద్దడం కంటే ఇతర రాజకీయ పరిణామాలకే ఎక్కువ ప్రాధాన్యత ఇస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఎన్నికల్లో కార్యకర్తల పాత్ర కేవలం ప్రచారానికి మాత్రమే పరిమితం కాదు. పోలింగ్ రోజున ఓటర్లను సమన్వయం చేయడం, పోలింగ్ కేంద్రాల వద్ద పార్టీ ప్రతినిధులను అందుబాటులో ఉంచడం, ఓటర్ల జాబితాలను పరిశీలించడం, ఓటింగ్ శాతం పెంచేందుకు కృషి చేయడం వంటి బాధ్యతలు కూడా వారిపైనే ఉంటాయి. ముఖ్యంగా పోలింగ్ ఏజెంట్లు ఎన్నికల ప్రక్రియలో అత్యంత కీలకం. ప్రతి కేంద్రంలో పార్టీ తరపున సమర్థులైన ప్రతినిధులు ఉండాలి. వారికి ఎన్నికల నిబంధనలపై అవగాహన ఉండాలి. అవసరమైన ఏర్పాట్లు, శిక్షణ, సమన్వయం ఉండాలి. అభిమానులు ఎంతమంది ఉన్నా ఈ వ్యవస్థ లేకపోతే వారి మద్దతు పూర్తిస్థాయిలో ఓట్లుగా మారుతుందనే గ్యారెంటీ ఉండదు. స్థానిక ఎన్నికల్లో వైసీపీకు ఎదురవుతున్న ప్రధాన బలహీనత ఇదేనని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ముఖ్యంగా నగరాల్లో వ్యక్తిగత పరిచయాలు మాత్రమే సరిపోవు. ప్రతి డివిజన్, వార్డు స్థాయిలో పనిచేసే బృందాలు అవసరం.



టీడీపీకి సంస్థాగత బలం.. వైసీపీకు నిర్వహణ లోపం

తెలుగుదేశం పార్టీకి నాలుగు దశాబ్దాలకు పైగా ఎన్నికల నిర్వహణలో అనుభవం ఉంది. గ్రామస్థాయి నుంచి రాష్ట్రస్థాయి వరకు పార్టీకి నాయకులు, కార్యకర్తలు, స్థానికంగా ప్రభావం చూపగల ప్రతినిధులు ఉన్నారు. గ్రామం, మండలం, నియోజకవర్గం, జిల్లా స్థాయిలో ఏర్పడిన నెట్‌వర్క్ ఆ పార్టీకి ప్రధాన బలం. ఎన్నికల సమయంలో అభ్యర్థుల ఎంపిక నుంచి ప్రచారం, ఓటర్ల సమీకరణ, పోలింగ్ ఏజెంట్ల నియామకం వరకు వివిధ స్థాయిల్లో బాధ్యతలు పంచుకునే వ్యవస్థ టీడీపీలో చాలాకాలంగా కొనసాగుతోంది. పోలింగ్ రోజున ఏజెంట్లను నియమించడం, వారికి అవసరమైన సమాచారం అందించడం, వారి సమస్యలను పరిష్కరించడం వంటి అంశాల్లో ఆ పార్టీకి అనుభవం ఉంది. దీనికి భిన్నంగా వైసీపీ మొదటి నుంచి నాయకుల వ్యక్తిగత ప్రభావం, అభ్యర్థుల సామర్థ్యం, జగన్‌పై ప్రజల్లో ఉన్న ఆదరణ ఆధారంగానే ఎక్కువగా ఎన్నికలను ఎదుర్కొంది. అధికారంలో ఉన్న ఐదేళ్లలో కూడా ఎన్నికల నిర్వహణకు అవసరమైన సంస్థాగత వ్యవస్థను బలోపేతం చేయడంపై తగిన దృష్టి పెట్టలేదనే విమర్శలు ఉన్నాయి. గతంలో జరిగిన ఉప ఎన్నికలు, సార్వత్రిక ఎన్నికల్లో వ్యక్తిగత నాయకత్వం, సంక్షేమ పథకాలు, వైఎస్ కుటుంబంపై ఉన్న అభిమానం పార్టీకి విజయాలు అందించాయి. కానీ ఇప్పుడు రాజకీయ పరిస్థితులు మారాయి. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు పార్టీకి అవసరమైన బలమైన వ్యవస్థను నిర్మించుకోకపోతే ఎన్నికల సమయంలో ఇబ్బందులు తప్పవు. స్థానిక ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థి వ్యక్తిగతంగా బలంగా ఉన్నంత మాత్రాన పార్టీ గెలుపు సాధ్యం కాదు. అతనికి అండగా పనిచేసే బృందం, ఓటర్లతో సంబంధాలు కలిగిన స్థానిక నాయకులు, పోలింగ్ కేంద్రాల వద్ద బాధ్యతలు నిర్వహించే ప్రతినిధులు తప్పనిసరి. టీడీపీతో పోలిస్తే ఈ విషయంలో వైసీపీ వెనుకబడి ఉందనే అభిప్రాయం ఉంది. నగరాలు, పట్టణాల్లో ఈ బలహీనత మరింత స్పష్టంగా కనిపించే అవకాశం ఉంది. ఎందుకంటే పట్టణ ఓటర్లు విభిన్న వర్గాలకు చెందినవారు. వారి సమస్యలు, అభిప్రాయాలు, రాజకీయ ప్రాధాన్యతలు కూడా భిన్నంగా ఉంటాయి. వారిని చేరుకోవడానికి కేవలం పార్టీ అధినేత ప్రసంగాలు సరిపోవు. స్థానిక సమస్యలపై పోరాడే నాయకత్వం, నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉండే కార్యకర్తలు అవసరం. పోలింగ్ కేంద్రాల వారీగా బాధ్యతలు అప్పగించి, ఎన్నికల ప్రక్రియపై అవగాహన కల్పించాలి. అభ్యర్థులకు అవసరమైన సహకారం అందించాలి. ఈ వ్యవస్థను ఇప్పటికైనా పటిష్ఠం చేయకపోతే ఆశించిన ఫలితాలు సాధించడం కష్టమనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.



ఫిలిప్స్ విధ్వంసం

భారత్‌కు ఘోర పరాజయం!

ఆక్లాండ్ మైదానంలో కివీస్ బ్యాటింగ్ తుఫాన్.. గ్లెన్ ఫిలిప్స్ విధ్వంసక శతకం.. మైకేల్ బ్రేస్‌వెల్ మెరుపు ఇన్నింగ్స్‌తో న్యూజిలాండ్ పరుగుల వరద పారించింది. నాలుగో టీ20లో భారత బౌలర్లను ఉతికారేసిన ఆతిథ్య జట్టు 259/7 పరుగుల భారీ స్కోరు సాధించింది. ఫిలిప్స్ కేవలం 49 బంతుల్లో 107 పరుగులతో సిక్సర్లు, ఫోర్ల వర్షం కురిపించగా, బ్రేస్‌వెల్ 25 బంతుల్లో 65 పరుగులతో మెరుపులు మెరిపించాడు. వీరిద్దరి విధ్వంసంతో న్యూజిలాండ్ చివరి ఓవర్లలో పరుగుల సునామీ సృష్టించింది. ముఖ్యంగా బ్రేస్‌వెల్ భారత స్పిన్నర్లతో పాటు మయాంక్ యాదవ్ బౌలింగ్‌లోనూ వినూత్న షాట్లతో విరుచుకుపడ్డాడు. కేవలం 41 బంతుల్లో 115 పరుగుల భాగస్వామ్యం నెలకొల్పి కివీస్‌కు కొండంత స్కోరు అందించారు. 260 పరుగుల అసాధ్య లక్ష్య ఛేదనకు దిగిన భారత్‌కు ఆరంభం నుంచే పరుగుల ఒత్తిడి వెంటాడింది. అభిషేక్ శర్మ, శ్రేయస్ అయ్యర్ సహా కీలక బ్యాటర్లు తడబడటంతో భారత ఇన్నింగ్స్ గాడి తప్పింది. తిలక్ వర్మ 35 పరుగులతో పోరాడినా ఫలితం లేకపోయింది. జాకబ్ డఫీ నిప్పులు చెరిగే బౌలింగ్‌తో నాలుగు వికెట్లు పడగొట్టగా, సాంట్నర్, ఫిషర్ చెరో రెండు వికెట్లతో భారత్‌ను కట్టడి చేశారు. చివరకు టీమిండియా 172/9 పరుగులకే పరిమితమైంది. దీంతో న్యూజిలాండ్ 87 పరుగుల భారీ విజయాన్ని అందుకుంది. ఫిలిప్స్ శతకానికి, డఫీ బౌలింగ్ పదునుకు భారత్ చిత్తయింది.



ముంబై ఇండియన్స్‌లోకి ఉతప్ప

కోచింగ్ టీమ్‌లో భారీ మార్పులు!

ఐపీఎల్ 2027కు ముందే ముంబై ఇండియన్స్ కొత్త వ్యూహాలకు పదును పెడుతోంది. జట్టును మళ్లీ ఛాంపియన్ ట్రాక్‌పైకి తీసుకురావడమే లక్ష్యంగా కోచింగ్ విభాగంలో కీలక మార్పులు చేపట్టింది. భారత మాజీ స్టార్ బ్యాటర్, రెండుసార్లు ఐపీఎల్ విజేత రాబిన్ ఉతప్పకు బ్యాటింగ్ కోచ్‌గా బాధ్యతలు అప్పగించింది. న్యూజిలాండ్ మాజీ పేసర్ మిచెల్ మెక్‌క్లెనగన్ బౌలింగ్ కోచ్‌గా, టీ దిలీప్ ఫీల్డింగ్ కోచ్‌గా, ధావల్ కులకర్ణి డెవలప్‌మెంట్ బౌలింగ్ కోచ్‌గా నియమితులయ్యారు. ఇప్పటికే హెడ్‌కోచ్‌గా బాధ్యతలు చేపట్టిన కీరన్ పొలార్డ్ నేతృత్వంలో కొత్త కోచింగ్ బృందం సిద్ధమైంది. మహేల జయవర్ధనే స్థానంలో పొలార్డ్ రావడంతో పాటు లసిత్ మలింగ, పరాస్ మాంబ్రే, కార్ల్ హాప్కిన్సన్‌లతో ముంబై వీడ్కోలు పలికింది. ఉతప్పకు ముంబైతో అనుబంధం ప్రత్యేకం. 2008 తొలి ఐపీఎల్ సీజన్‌లో ఇదే జట్టుతో తన ప్రయాణం ప్రారంభించిన ఆయన, ఇప్పుడు కోచ్‌గా తిరిగి రావడం విశేషం. మొత్తం 205 ఐపీఎల్ మ్యాచ్‌ల్లో 4,952 పరుగులు చేసిన ఉతప్ప 2014లో కోల్‌కతా, 2021లో చెన్నై జట్లతో టైటిళ్లు గెలిచారు. మెక్‌క్లెనగన్ ముంబై తరపున 56 మ్యాచ్‌ల్లో 71 వికెట్లు తీసి 2015, 2019 టైటిల్ విజయాల్లో కీలక పాత్ర పోషించారు. అభిమానుల నమ్మకాన్ని తిరిగి సంపాదించి, స్వదేశంతో పాటు విదేశీ మైదానాల్లోనూ సత్తా చాటడమే లక్ష్యమని ఉతప్ప స్పష్టం చేశారు. డిసెంబర్ 16న గోవాలో జరగనున్న మినీ వేలంతో కొత్త టీమ్ అసలు కసరత్తు ప్రారంభం కానుంది. ముంబై మళ్లీ మకుటం దక్కించుకుంటుందా అన్న ఆసక్తి ఇప్పటి నుంచే మొదలైంది!

గంభీర్ కోసం 4 ఐపీఎల్ జట్ల వేట!

- కోచ్‌గా మళ్లీ ఐపీఎల్‌లోకి గంభీర్?
- కోల్‌కతా, రాజస్థాన్ నుంచి ప్రపోజల్స్

టీమిండియా హెడ్‌కోచ్ గౌతమ్ గంభీర్ చుట్టూ ఐపీఎల్ వర్గాల్లో ఒక్కసారిగా ఆసక్తి పెరిగింది. 2027 వన్డే ప్రపంచకప్ వరకు భారత జట్టు కోచ్‌గా ఒప్పందం ఉన్నప్పటికీ, 2028 ఐపీఎల్ సీజన్‌పై ఇప్పటికే నాలుగు ఫ్రాంచైజీలు కన్నేసినట్లు సమాచారం. గంభీర్‌ను మెంటార్‌గా లేదా కోచ్‌గా తమ జట్టులోకి తీసుకురావాలని ఆయా యాజమాన్యాలు అంతర్గత చర్చలు జరుపుతున్నట్లు డైనిక్ జాగరణ్ కథనం వెల్లడించింది. ఇందులో గంభీర్‌కు గతంలో టైటిల్ అందించిన కోల్‌కతా నైట్‌రైడర్స్ కూడా ఉండటం విశేషం. రాజస్థాన్ రాయల్స్‌తో గంభీర్ ప్రతినిధులు ప్రాథమిక చర్చలు జరిపినట్లు సమాచారం. మరో రెండు ఫ్రాంచైజీలు కూడా ఆయన సేవలపై ఆసక్తి చూపుతున్నట్లు తెలుస్తోంది. అయితే బీసీసీఐ గంభీర్ ఒప్పందాన్ని పొడిగిస్తే ఈ ప్రణాళికలు వాయిదా పడే అవకాశం ఉంది. గతంలో లక్నో సూపర్ జెయింట్స్ మెంటార్‌గా 2022, 2023 సీజన్లలో జట్టును ప్లేఆఫ్స్‌కు చేర్చిన గంభీర్, తిరిగి కోల్‌కతా బాధ్యతలు చేపట్టి 2024లో పదేళ్ల నిరీక్షణకు తెరదించి టైటిల్ అందుకోవడంలో కీలక పాత్ర పోషించారు. భారత జట్టు కోచ్‌గా రెండు ఐసీసీ టైటిళ్లు, ఆసియా కప్, ఆసియా క్రీడల స్వర్ణం సాధించిన అనుభవం ఆయన ఖాతాలో ఉన్నాయి. అయితే గంభీర్ భవిష్యత్ నిర్ణయం బీసీసీఐ ఒప్పందంపైనే ఆధారపడి ఉంటుంది. ఐపీఎల్‌లో ఆయన మళ్లీ వ్యూహకర్తగా అడుగుపెడతారా? అన్నది ఇప్పుడు క్రికెట్ వర్గాల్లో హాట్‌టాపిక్‌గా మారింది!





మళ్లీ మొదలైన జోడీ వేట

- నెట్స్‌లో రోహిత్, కోహ్లీ ఆట
- 2027 వరల్డ్ కప్ లక్ష్యం

టీమిండియా అభిమానులకు పండగలాంటి వార్త! బ్యాట్ పట్టి మైదానంలోకి దిగితే పరుగుల వరద పారించే ఇద్దరు దిగ్గజాలు మళ్లీ రంగంలోకి దిగారు. హిట్‌మ్యాన్ రోహిత్ శర్మ, రన్ మెషీన్ విరాట్ కోహ్లీ న్యూజిలాండ్‌తో జరగనున్న ఐదు వన్డేల సిరీస్‌కు సన్నాహాలు ప్రారంభించారు. బీసీసీఐ విడుదల చేసిన వీడియోలో ఇద్దరూ నెట్స్‌లో చెమటోడుస్తూ కనిపించడంతో అభిమానుల్లో ఉత్సాహం రెట్టింపైంది. 'దే ఆర్ బ్యాక్' అంటూ బీసీసీఐ పెట్టిన క్యాప్షన్ క్రికెట్ వర్గాల్లో ఆసక్తి రేపుతోంది. నవంబర్ 4న ఆక్లాండ్‌లోని ఈడెన్ పార్క్ వేదికగా సిరీస్ ప్రారంభం కానుంది. వచ్చే ఏడాది జరగనున్న 2027 వన్డే ప్రపంచకప్‌కు ముందు ఈ సిరీస్ కీలకంగా మారనుంది. వన్డేల్లో రెండో అత్యధిక పరుగుల వీరుడైన కోహ్లీ ఖాతాలో 15,109 పరుగులు, 55 శతకాలు ఉన్నాయి. రోహిత్ 12,120 పరుగులు, 35 సెంచరీలతో దూసుకుపోతున్నారు. ఇటీవల వెస్టిండీస్‌తో జరిగిన వన్డే సిరీస్‌లో కోహ్లీ మూడు ఇన్నింగ్స్‌ల్లో 168 పరుగులు చేయగా, రోహిత్ 225 పరుగులతో సత్తా చాటారు. ఈ ఏడాది రోహిత్ 12 ఇన్నింగ్స్‌ల్లో 604 పరుగులు సాధించి తన ఫామ్‌ను చాటుకున్నారు. అనుభవం, దూకుడు కలిసిన ఈ ఇద్దరు స్టార్ బ్యాటర్లు న్యూజిలాండ్‌పై ఎలా విరుచుకుపడతారోనన్న ఆసక్తి నెలకొంది. ప్రపంచకప్ వేటకు ముందు హిట్‌మ్యాన్, కింగ్ కోహ్లీ జోడీ మళ్లీ బ్యాట్ ఝళిపించేందుకు సిద్ధమైంది!



థియేటర్లలో 'కల్ట్' రక్తపాతం!

విశ్వక్‌సేన్ ఊచకోత.. యాక్షన్ మోత ! స్క్విడ్ గేమ్ తరహాలో డేంజరస్ డెత్ గేమ్!

యాక్షన్‌కు హద్దుల్లేవు.. రక్తపాతానికి బ్రేకుల్లేవు.. ఒక్కసారి ఆట మొదలైతే ప్రాణాలతో బయటపడటం అంత ఈజీ కాదు! ఇదీ విశ్వక్‌సేన్ స్వీయ దర్శకత్వంలో తెరకెక్కిన యాక్షన్ థ్రిల్లర్ '#కల్ట్' కథా ప్రపంచం. సాధారణ కథలకు భిన్నంగా రక్తపాతం, క్రైమ్, డార్క్ కామెడీ, ఉత్కంఠభరిత సన్నివేశాలతో ప్రేక్షకులను కొత్త అనుభూతిలోకి తీసుకెళ్లాలని ప్రయత్నించారు. ఓ మంత్రి కొడుకు ఎల్విన్ (తారక్ పొన్నప్プ) నిర్వహించే హైప్రొఫైల్ రేవ్ పార్టీలోకి అనుకోకుండా ముగ్గురు స్నేహితులు సిద్ధు, రమ్మీ, థామస్ ప్రవేశిస్తారు. అక్కడ మొదలైన సందడి క్షణాల్లోనే భయంకరమైన ప్రాణాంతక ఆటగా మారుతుంది. బయటకు వెళ్లే దారులన్నీ మూసుకుపోవడంతో పార్టీకి వచ్చిన వారంతా హంతకుల ఉచ్చులో చిక్కుకుంటారు. సరిగ్గా విరామానికి ముందు రంగంలోకి దిగే మావెరిక్ పోలీస్ సంకల్ప్ నాయక్‌గా విశ్వక్‌సేన్ ఎంట్రీ కథకు అసలైన వేగాన్ని తీసుకొస్తుంది. ఆ తర్వాత జరిగే పరిణామాలు, ఊహించని దాడులు, ప్రతిదాడులు ప్రేక్షకుల్లో ఉత్కంఠను పెంచుతాయి. ముఖ్యంగా చివరి 40-45 నిమిషాలు సాంకేతికంగా, భావోద్వేగపరంగా అకట్టుకుంటాయి. నటుడిగా విశ్వక్‌సేన్ మరోసారి తన నత్తా చాటారు. కార్తికేయ, అనిరుధ్ భాస్కర్, ఈజీ ముగ్గురు స్నేహితులుగా సహజమైన నటనతో మెప్పించారు. తారక్ పొన్నప్ప ప్రతినాయకుడిగా కనిపించగా, మురళీశర్మ, శ్రీకాంత్ అయ్యంగార్, గాయత్రి భరద్వాజ్ తమ పాత్రల్లో కనిపించారు. రవి బస్రూర్ నేపథ్య సంగీతం, అరవింద్ విశ్వనాథన్ కెమెరా పనితనం సినిమాకు బలాన్నిచ్చాయి. అయితే కథనంలో పదును, స్క్రీన్‌ప్లేలో వేగం, ఎడిటింగ్‌లో మెరుపులు కొరవడటంతో కొన్ని సన్నివేశాలు సాగదీసిన భావన కలిగిస్తాయి. ముఖ్యంగా అనుపత్రి నేపథ్యంలోని ఘట్టాలు ప్రత్యేకంగా నిలుస్తాయి. భారీ అంచనాలు, కొత్త ఆలోచనలు ఉన్నా వాటిని పూర్తిస్థాయిలో తెరపై ఆవిష్కరించడంలో కొన్ని లోపాలు కనిపిస్తాయి. అయినప్పటికీ రక్తపాతం, వైవిధ్యమైన యాక్షన్, డార్క్ థ్రిల్లర్లను ఇష్టపడే ప్రేక్షకులకు '#కల్ట్' ఒక భిన్నమైన సినిమా అనుభవం!

విశ్వక్‌సేన్‌కు పోలీసుల షాక్

థియేటర్ సందర్శనకు బ్రేక్!

మాస్ కా దాస్ విశ్వక్‌సేన్ అభిమానులకు ఓవైపు 'కల్ట్' సినిమా విడుదల సంబరాలు.. మరోవైపు అనూహ్య నిరాశ! రేపు థియేటర్లలోకి అడుగుపెట్టనున్న ఈ చిత్రాన్ని ప్రేక్షకులతో కలిసి వీక్షించాలన్న విశ్వక్‌సేన్ ఆశలకు పోలీసుల అనుమతి నిరాకరణ అడ్డుకట్ట వేసింది. భారతీయ సినీ పరిశ్రమలోనే తొలి స్లాషర్ చిత్రంగా ప్రచారం పొందుతున్న 'కల్ట్'కు విశ్వక్‌సేన్ హీరోగా నటించడంతో పాటు దర్శకత్వం కూడా వహించారు. విడుదల రోజున అభిమానుల మధ్య సందడి చేయాలని, హైదరాబాద్ ఆర్టీసీ క్రాస్‌రోడ్స్‌లోని ప్రముఖ సుదర్శన్ థియేటర్‌లో ఉదయం ఆటను ప్రేక్షకులతో కలిసి చూడాలని ఆయన ప్రణాళిక సిద్ధం చేసుకున్నారు. అయితే భద్రతా కారణాలను దృష్టిలో పెట్టుకున్న పోలీసులు ఈ పర్యటనకు అనుమతి నిరాకరించారు. దీంతో తమ అభిమాన హీరోను థియేటర్‌లో ప్రత్యక్షంగా చూసి, ఆయనతో కలిసి సినిమా ఆస్వాదించాలని ఆశించిన అభిమానులకు నిరాశ ఎదురైంది. గతంలో 'ది ప్యారడైజ్' సినిమా సందర్భంగా నేచురల్ స్టార్ నాని కూడా ఇదే ఆర్టీసీ క్రాస్‌రోడ్స్‌లోని సంధ్య థియేటర్‌ను సందర్శించేందుకు అనుమతి పొందలేకపోయారు. కొన్ని సంవత్సరాల క్రితం సంధ్య థియేటర్ వద్ద చోటుచేసుకున్న దురదృష్టకర తొక్కిసలాట ఘటన నేపథ్యంలో పోలీసులు భద్రతా ఏర్పాట్ల విషయంలో మరింత అప్రమత్తంగా వ్యవహరిస్తున్నారు. అదే భద్రతా కారణాలతో ఇప్పుడు విశ్వక్‌సేన్ పర్యటనకూ అనుమతి లభించలేదు.

సమంత సెన్సేషన్

సినిమా టు బిజినెస్ క్వీన్

- రూ.120 కోట్ల సువాసన
- 8 నెలల్లోనే ఎనిమిది రెట్ల వృద్ధి!

వెండితెరపై అందంతో, అభినయంతో ప్రేక్షకుల మనసులు గెలుచుకున్న సమంత రూత్ ప్రభు ఇప్పుడు వ్యాపార ప్రపంచంలోనూ తనదైన ముద్ర వేస్తున్నారు. నటిగా ఎన్నో విజయాలు అందుకున్న ఈ స్టార్ హీరోయిన్.. ఇప్పుడు పారిశ్రామికవేత్తగా సంచలన విజయాన్ని సొంతం చేసుకున్నారు. ఆమె భాగస్వామ్యంతో ప్రారంభమైన పెర్ఫ్యూమ్ బ్రాండ్ 'సీక్రెట్ ఆల్కెమిస్ట్' కేవలం ఎనిమిది నెలల్లోనే ఎనిమిది రెట్ల వృద్ధిని నమోదు చేసి, ఏకంగా రూ.120 కోట్ల ఆదాయాన్ని దాటినట్లు నివేదికలు వెల్లడిస్తున్నాయి. అంకితా థడానీ, ఆకాష్ వాలియాతో కలిసి సమంత ఈ బ్రాండ్‌ను అభివృద్ధి చేశారు. అయితే ఈ వ్యాపార ప్రయాణం వెనుక కేవలం లాభాల లెక్కలు మాత్రమే లేవు.. జీవితంలో ఎదురైన కష్టాల నుంచి పుట్టిన కొత్త ఆలోచన ఉంది. మయోసైటిస్ అనే ఆటో ఇమ్యూన్ వ్యాధితో పోరాడిన సమయంలో తన జీవితాన్ని కొత్త కోణంలో చూసుకున్నానని సమంత వెల్లడించారు. ఆరోగ్య సమస్యల కారణంగా దాదాపు రెండేళ్లపాటు పెర్ఫ్యూమ్‌లకు దూరంగా ఉన్న ఆమె, తిరిగి సువాసనలను ఆస్వాదించే ప్రయత్నంలో సీక్రెట్ ఆల్కెమిస్ట్‌తో పరిచయం పెంచుకున్నారు. వ్యక్తిగతంగా నమ్మిన ఉత్పత్తుల్లో పెట్టుబడులు పెట్టాలన్న ఆలోచనతో వ్యాపార రంగంలోకి అడుగుపెట్టారు. ఇప్పటికే సాకి, మైల్ కలెక్టివ్, గుటాకా వంటి బ్రాండ్లతోనూ ఆమెకు అనుబంధం ఉంది. మరోవైపు 'మా ఇంటి బంగారం' సినిమాతోనూ విజయాన్ని అందుకున్నట్లు ప్రచారం జరుగుతోంది. అయితే రూ.120 కోట్లు బ్రాండ్ ఆదాయం మాత్రమే.. సమంత వ్యక్తిగత సంపాదన లేదా లాభం కాదు. ఆరోగ్య సవాళ్లను అధిగమిస్తూ సినిమా, వ్యాపారం రెండు రంగాల్లోనూ ముందుకు సాగుతున్న సమంత ప్రయాణం ఇప్పుడు అందరి దృష్టిని ఆకర్షిస్తోంది.





ఇంట్లో అదిరిపోయే ట్విస్టులు!

వెంకీ కామెడీకి క్రైమ్ థ్రిల్లర్ టచ్!
ఆదర్శ కుటుంబానికి త్రివిక్రమ్ ట్రీట్‌మెంట్

విక్టరీ వెంకటేష్ అంటేనే కుటుంబ ప్రేక్షకులకు పండగ.. ఆయన కామెడీ టైమింగ్‌కు తోడు ఎమోషన్స్, అదిరిపోయే పంచ్ డైలాగులు తోడైతే థియేటర్లలో నవ్వుల సందడే! ఇప్పుడు అదే మ్యాజిక్‌ను మరోసారి తెరపైకి తీసుకొచ్చారు దర్శకుడు త్రివిక్రమ్ శ్రీనివాస్. రెండు దశాబ్దాలకు పైగా విరామం తర్వాత వీరిద్దరి కాంబినేషన్‌లో వచ్చిన 'ఆదర్శ కుటుంబం - హౌస్ నంబర్ 47' ప్రేక్షకులకు వినోదంతో పాటు ఉత్కంఠను పంచే ప్రయత్నం చేసింది. చిట్టి (వెంకటేష్), స్వర్ణ (శ్రీనిధి శెట్టి) నడిపించే ఓ సాధారణ మధ్యతరగతి కుటుంబం చుట్టూ కథ తిరుగుతుంది. అప్పులు, వైద్య ఖర్చులతో సతమతమవుతున్న ఆ కుటుంబానికి లాటరీ రూపంలో అదృష్టం తలుపుతడుతుంది. ఒక్కసారిగా మారిన పరిస్థితులతో సంబరాల్లో మునిగిపోయిన ఆ ఇంటికి అనుకోని ప్రమాదం ఎదురవుతుంది. మరోవైపు క్రిమినల్ గ్యాంగ్ కదలికలు కథలో ఉత్కంఠను పెంచుతాయి. ఇంటి పనులు చేస్తూనే 'నేనే ఇంటి పెద్ద' అంటూ చిట్టి చేసే హడావుడి నవ్వులు పూయిస్తుంది. భార్యాభర్తల మధ్య వయసు వ్యత్యాసంపై వచ్చే సంభాషణలు కూడా కథకు ప్రత్యేకతను తీసుకొస్తాయి. విరామానికి ముందు వచ్చే ఊహించని మలుపులు ప్రేక్షకులను సీట్ల అంచున కూర్చోబెడతాయి. సత్య, రఘుబాబు, నారా రోహిత్ తమ పాత్రలతో వినోదాన్ని పెంచగా, రావు రమేష్, నివేదా పేతురాజ్ పాత్రలు కథకు కొత్త కోణాన్ని జోడిస్తాయి. వెనుక కథల్లో మరింత భావోద్వేగం ఆశించినా, ద్వితీయార్ధంలో కొన్ని మలుపులు తడబడినా వెంకటేష్ తన సహజ నటనతో సినిమాను ముందుకు నడిపించారు. శ్రీనిధి శెట్టి, బాలనటులు రాజ్ ప్రజ్వల్, యువినా ఆకట్టుకున్నారు. తమన్ సంగీతం మాత్రం ఆశించిన స్థాయిలో మెప్పించలేకపోయింది. రవి కె. చంద్రన్ ఛాయాగ్రహణం కథకు చక్కగా సరిపోయింది. త్రివిక్రమ్ నుంచి కొత్త తరహా కథను ఆశించేవారికి కొన్ని నిరాశలు ఎదురైనా, వెంకీ అభిమానులకు మాత్రం కామెడీ, కుటుంబ భావోద్వేగాలు, క్రైమ్ థ్రిల్ కలిసిన వినోదాల విందు ఈ చిత్రం. చివరి వరకు ఆసక్తి నిలిపే ప్రయత్నం చేసిన 'ఆదర్శ కుటుంబం' పండుగ సీజన్‌లో కుటుంబంతో కలిసి నవ్వుతూ, ఉత్కంఠగా చూడదగిన చిత్రంగా నిలుస్తుంది.

This newspaper is Owned and Published by **GUNDEBOINA VENKANNA** from 2-7-76, GURUKRUPA COMPLEX, UPPAL, MEDCHAL MALKAJGIRI, TELANGANA - 500047. Phone Number: 9440906108.
Editor: **GUNDEBOINA VENKANNA** and Printed at 1-5-431/20/4, JONNABANDA, OLD ALWAL, MEDCHAL MALKAJGIRI, TELANGANA - 500010.
PRGI REGD No.: **TGBIL/26/A6717**. www.rajyasamskarana.com.